


"మకర సంక్రాంతి" సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు. ఈ సంక్రాంతి పండుగ మీ జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. పాడిపంటలతో పల్లె సీమలు కళకళలాడాలని కోరుకుంటున్నాను. సంక్రాంతి పండుగ ఆనందంగా జరుపుకోవాలని అందరికీ శుభాకాంక్షలు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 15.01.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 269 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# అంతర్జాతీయ పండుగగా పొంగల్

## తమిళ సంస్కృతిని ప్రేమించే వారిలో నేనూ ఒకడిని : ప్రధాని మోదీ



**దిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఇప్పుడు 'పొంగల్ అంతర్జాతీయ పండుగగా మారిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. తమిళులతో పాటు యావత్ ప్రపంచంలో తమిళ సంస్కృతిని ప్రేమించే వారు ఆనందోత్సాహాలతో పొంగల్ వేడుకను జరుపుకుంటారని ఆయన పేర్కొన్నారు. తమిళ సంస్కృతిని ప్రేమించే వారిలో తాను కూడా ఒకడినని మోదీ తెలిపారు. అందరితో కలిసి పొంగల్ వేడుకలలో భాగం కావడాన్ని తాను ప్రత్యేక గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. బుధవారం దేశ రాజధాని దిల్లీలో కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ నివాసంలో జరిగిన పొంగల్ వేడుకల్లో ప్రధాని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులు, బ్యూరోక్రాట్లు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పొంగల్ పండుగ మన జీవితానికి ఆనందకర అనుభవాన్ని ప్రసాదిస్తుందని మోదీ అన్నారు. అన్నదాతల శ్రమను గుర్తిస్తూ, ప్రకృతి మాతకు, పుడమి తల్లికి, సూర్య భగవానుడికి కృతజ్ఞతలు తెలుపుకునే అపురూప సందర్భం పొంగల్ అని ఆయన కొనియాడారు. ప్రకృతి, కుటుంబం, సమాజం మధ్య సమతూకాన్ని పాటించే బాటను ఈ పండుగ చూపిస్తుందన్నారు. నేల సారాన్ని కాపాడటం, జల పరిరక్షణ, భవిష్యత్ తరాల కోసం వనరుల సద్వినియోగం అవసరమని మోదీ తెలిపారు. ఈ విలువలను కాపాడేందుకే 'మిషన్ లైఫ్, 'ఏక్ పేడ్ మా కే నావమ్, 'అమృత్ సరోవర్ లాంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. పొంగల్ లాంటి పండుగల వల్లే 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ల స్ఫూర్తికి మరింత బలం చేకూరుతోందన్నారు.

**తమిళ సంస్కృతి యావత్ దేశ ఉమ్మడి సంస్కృతి :** 'తమిళ సంస్కృతి కేవలం తమిళనాడుకు పరిమితం కాదు. ఇది యావత్ భారతదేశ ఉమ్మడి సంస్కృతి. ఇతర ప్రపంచ దేశాల్లోనూ దాని ఉనికి ఉంది. ప్రపంచ మానవత్వ వారసత్వంతోనూ తమిళ సంస్కృతికి అవినాభావ సంబంధం ఉంది. గతేడాది కూడా తమిళ సంస్కృతితో ముడిపడిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొనే గొప్ప అవకాశం నాకు లభించింది. తమిళనాడులోని 1000 సంవత్సరాల ప్రాచీన గంగైకొండ చోళపురం ఆలయంలో నేను పూజలు నిర్వహించాను. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో నిర్వహించిన 'కాశీ తమిళ సంగమం' కార్యక్రమంలోనూ నేను భాగమయ్యాను. దేశ సాంస్కృతిక ఐకమత్యాన్ని బలోపేతం చేసేందుకు ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంబన్ వంతెనను ప్రారంభించడానికి రామేశ్వరానికి వెళ్లినప్పుడు మరోసారి నేను తమిళ చరిత్ర ఘనతకు సాక్షిగా నిలిచాను' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**మకర సంక్రాంతి, లోహ్రీ, మాఘ్ బిహు వేడుకలు :** 'దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు పొంగల్‌తో పాటు లోహ్రీ, మకర సంక్రాంతి, మాఘ్ బిహు వంటి పండుగలను ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. భారత్‌లోని, విదేశాల్లో ఉన్న తమిళ సోదరులు, సోదరీమణులకు నా తరఫున హృదయపూర్వక పొంగల్ శుభాకాంక్షలు. ఇదొక కుటుంబపరమైన పండుగ. వికాసం, కృతజ్ఞత, ఐకమత్యం అనే భావనలను కుటుంబాలు సంతోషంగా వ్యక్తపర్చడానికి పొంగల్ వేడుక సరైన సందర్భం' అని ప్రధాని మోదీ తెలిపారు.

**ఏపీ, తెలంగాణ, కర్ణాటక ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ ఓ ట్వీట్ చేశారు. పంట చేతికొచ్చే సమయంలో జరిగే ఈ పండుగ భారతదేశ సాంస్కృతిక సుసంపన్నతను అద్దం పడుతుందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విభిన్న రకాలుగా స్థానిక సంప్రదాయాలకు అనుగుణంగా సంక్రాంతి వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ సంతోషం, వికాసం, ఆరోగ్యాలను ప్రసాదించాలని ఈసందర్భంగా సూర్య భగవానుడిని తాను ప్రార్థిస్తున్నట్లు మోదీ తెలిపారు.

మిగతా 2లో...

# నారావారిపల్లెలో మంత్రి లోకేష్ ప్రజాదర్బార్



**నారావారిపల్లె(జర్నలిస్ట్ ఫైల్) :** తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలోని తన నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 81వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. భోగి పండగ వేళ సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌ను కలిసేందుకు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలతోపాటు టీడీపీ కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన లోకేష్.. వారందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.


వివిధ సమస్యలపై ప్రజలు, కార్యకర్తల నుంచి వచ్చిన వినతులు ఆయన స్వీకరించారు. వారసత్వంగా తమకు సంక్రమించిన 1.83 ఎకరాల భూమిని అన్యాక్రాంతం చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని మంత్రి నారా లోకేష్‌ను అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం బసినికొండ గ్రామానికి చెందిన పత్తి శివకుమార్ విజ్ఞప్తి చేశారు. తిరుమలలో అంగప్రదక్షణ భక్తులకు ఆఫ్ లైన్ ద్వారా టోకెన్స్ జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని.. ప్రస్తుతం ఉన్న ఆన్ లైన్ విధానాన్ని రద్దు చేయాలంటూ 'తిరుమలలో అంగప్రదక్షణ భక్తబృందం' ప్రతినిధులు మంత్రి నారా లోకేష్‌కు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

చిత్తూరు జిల్లా నింద్రమండలం, కచ్చరావేడు గ్రామంలో దళితులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలని మంత్రి నారా లోకేష్‌ను కలిసి విన్నవించారు. తిరుపతి, పరిసర ప్రాంతాల్లో చిరు వ్యాపారాలు చేసుకుంటూ 150 ఎస్టీ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని.. ఆయా కుటుంబాలకు ఒకే ప్రాంతంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని శ్రీ వేంకటేశ్వర ఎస్టీ ఎరుకల సంఘం ప్రతినిధులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి విన్నవించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో సొసైటీ విధానంలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డేటా ఎంట్రీ ఆఫీసర్లకు ఇతర ఉద్యోగుల మాదిరిగానే వైద్య సదుపాయంతో పాటు శ్రీవారి దర్శనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్‌ను కలిసి కోరారు.

గత వైసీపీ ప్రభుత్వంలో డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగంలో తొలగించిన 160 మంది కాంట్రాక్ట్ సూపర్ వైజర్లు, పార్ట్ టైం సూపర్ వైజర్లకు డీఈఎస్ విభాగంలో తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని ఏపీ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ కాంట్రాక్ట్ సూపర్ వైజర్స్ అసోసియేషన్ (ఏపీఈఎస్ సీఎస్ఏ) ప్రతినిధులు మంత్రి నారా లోకేష్‌ను కోరారు.

వారసత్వంగా సంక్రమించిన తమ రెండెకరాల భూమిని ఆన్ లైన్‌లో నమోదు చేసి హక్కులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బలిజపల్లికి చెందిన కె.పార్వతి విజ్ఞప్తి చేశారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు. అనంతరం అందరితో కలిసి మంత్రి నారా లోకేష్ ఫోటోలు దిగారు.

# మకరజ్యోతి దర్శనం



**శబరిమల(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమలలో మకరజ్యోతి రూపంలో అయ్యప్ప స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. తిరువాభరణ ఘట్టం పూర్తయ్యాక పొన్నాంబలమేడు పర్వత శిఖరాల్లో మకరజ్యోతి దర్శనమిచ్చింది. జ్యోతిని దర్శించుకునేందుకు లక్షలాది మంది అయ్యప్ప భక్తులు తరలివచ్చారు. స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో శబరిగిరులు మార్మోగాయి.


కాంతమాల కొండలపై దేవతలు, రుషులు కలిసి భగవంతునికి హారతి ఇస్తారని అయ్యప్ప భక్తుల ప్రగాఢ విశ్వాసం. అంతకుముందు పందాళం నుంచి తీసుకువచ్చిన తిరువాభరణాలను ప్రధాన అర్చకులు స్వామివారికి అలంకరించారు. అనంతరం మూలమూర్తికి హారతి ఇచ్చారు. ఆ వెంటనే క్షణాల్లో చీకట్లను తొలగిస్తూ పొన్నాంబలంమేడు పర్వత శిఖరాల్లో మకరజ్యోతి దర్శనమిచ్చింది. అది చూసి మనసు నిండుగా భక్తిభావంతో తన్మయం చెందిన భక్తులు స్వామియే శరణం అయ్యప్ప అంటూ శరణమిల్లారు. జ్యోతి దర్శనం నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మకరజ్యోతి దర్శనం కోసం సన్నిధానం, పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. వర్చువల్ క్యూ ద్వారా 35 వేల మంది యాత్రికులకు ప్రత్యేక అనుమతి ఇచ్చారు. పందాళం, కొప్రాకలం వంటి ప్రాంతాల్లో భారీ రద్దీ నెలకొంది.

మిగతా 2లో...

# ఎగుమతుల్లో రాష్ట్రానికి ఐదో స్థానం

- తొలి 4 స్థానాల్లో మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్, యుపి
- నీతి ఆయోగ్ - 2024 ఎగుమతుల నివేదిక



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఎగుమతుల్లో దేశంలో ఆంధ్రప్రదేశ్ ఐదో స్థానంలో నిలిచింది. ఈ మేరకు బుధవారం నీతి ఆయోగ్ 2024 ఎగుమతుల నివేదికను విడుదల చేసింది. అందులో మొదటి స్థానంలో 68.01 స్కోర్‌తో మహారాష్ట్ర మొదటి స్థానంలో నిలిచింది. 64.41 స్కోర్‌తో తమిళనాడు రెండో స్థానంలోనూ, 64.02 స్కోర్‌తో గుజరాత్, 62.09 స్కోర్‌తో ఉత్తరప్రదేశ్‌తో మూడు, నాలుగో స్థానాల్లోనూ నిలిచాయి. 60.65 స్కోర్‌తో ఆంధ్రప్రదేశ్ ఐదో స్థానంలో నిలిచింది. 57.14 స్కోర్‌తో తెలంగాణ ఎనిమిదో స్థానంలో నిలిచింది.

2024లో ఆంధ్రప్రదేశ్ నుంచి రూ.1.65 లక్షల కోట్లు ఎగుమతులు జరిగాయి. 60.65 స్కోర్‌తో ఐదో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ నుంచి యుఎఇ(21.96 శాతం), చైనా (6.95 శాతం), సింగపూర్ (5.56 శాతం), ఇండోనేషియా (4.35 శాతం), సౌదీ అరేబియా (3.07 శాతం) ఎగుమతులు జరిగాయి. సముద్ర ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు, ఫార్మాస్యూటికల్స్, హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ రంగాల నుంచి ఎగుమతులు ఎక్కువ ఉన్నాయి. ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్, ఎలక్ట్రికల్ వెహికల్స్, సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్, మెడికల్ డివైజ్ రంగాల్లో ఇప్పుడిప్పుడు ఎగుమతుల్లో భాగస్వామ్యం అవుతున్నాయి. దేశంలోని సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో 60 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే జరుగుతాయి. 2023–24లో ఏపి జిఎస్‌డిపి రూ.14.4 లక్షల కోట్లు చేరిందని, వృద్ధి రేటు సుమారుగా 5 శాతం నమోదైంది. 2023–24లో రాష్ట్రం మొత్తం రూ.1.6 లక్షల కోట్ల విలువైన ఎగుమతులను రికార్డుస్థాయిలో నమోదు చేసింది. సముద్ర ఉత్పత్తులు రూ.24,679 కోట్ల ఎగుమతులు జరిగాయి. సముద్ర ఉత్పత్తులు నెల్లూరు, కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల నుంచి ఎగుమతులు జరిగాయి. ఫార్మాస్యూటికల్స్ రూ.18,410 కోట్లు ఎగుమతులు జరిగాయని, విశాఖపట్నం ప్రధాన కేంద్రంగా ఈ ఎగుమతులు జరిగాయని ఆ నివేదిక పేర్కొంది.

ఆంధ్రప్రదేశ్ ఎగుమతులు 2023లో 4.4 శాతం ఉంటే, 2024లో 4.5 శాతానికి పెరిగాయి. రొయ్యలు రూ.19,776 కోట్లు, ఔషధాలు రూ.10,875 కోట్లు, లైట్ – వెసెల్స్, ఫైర్ ఫ్లోట్లు తదితర ఉత్పత్తులు

మిగతా 2లో...



# పీపీపీకి కేంద్రం గ్రీన్ సిగ్నల్

- పిపిపిపై రాష్ట్రానికి కేంద్రం మరో లేఖ
- వైద్య సేవల డిమాండ్, లభ్యతల మధ్య తేడాను పిపిపి ద్వారా పూరించండి
- 5 రకాల సేవల్ని విస్తరించడానికి సూచనలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** వైద్య, ఆరోగ్య సేవల్ని ప్రజలకు మరింత విస్తృత స్థాయిలో అందించడానికి పిపిపి విధానాన్ని అవలంబించాలని కేంద్ర ఆరోగ్య శాఖ రాష్ట్రానికి సూచించింది. ఈ మేరకు పిపిపి మోడల్‌ను అనుసరించడంపై వివరణాత్మకమైన లేఖను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్‌కు కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి విజయ్ నెహ్రా ఈనెల 12న లేఖ రాశారు. లేఖతో పాటు వివిధ సేవలను గరిష్ట స్థాయిలో పిపిపి ద్వారా అందించడానికి 27 పేజీలతో కూడిన మార్గదర్శకాలను వివరించారు.

వైద్య విద్యను విస్తరించడానికి పిపిపి అత్యంత అనుకూల సాధనమని కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జె.పి.నడ్డా రాష్ట్రానికి ఇటీవల రాసిన లేఖను ప్రస్తావించారు. దానికి అనుబంధంగా రెండవ లేఖను రాస్తున్నట్లు కేంద్ర అధికారి నెహ్రా తెలిపారు.

2లో...

# సంక్రాంతి నుంచైనా జగన్ బుద్ధి మారాలి

- కూటమి పాలనతో ప్రజల్లో మరింత ఆనందం
- ప్రపంచం మొత్తం ఏపీవైపు చూస్తోంది
- అసూయతో రగిలిపోతున్న జగన్ : మంత్రి సవిత
- పెనుకొండలో ఘనంగా సంక్రాంతి సంబరాలు
- ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వందలాది మంది మహిళలు
- విజేతలకు బహుమతుల ప్రదానం
- ఎద్దు బండ్ల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న రైతులు
- ఆకట్టుకున్న గంగిరెద్దుల విన్యాసాలు



**పెనుకొండ/శ్రీసత్యసాయి (జర్నలిస్ట్ ఫైల్):** సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకుంటున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆనందం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని,

మిగతా 2లో...

# అంటు వ్యాధుల గుర్తింపులో తొలిసారిగా ప్రజల భాగస్వామ్యం

ఐహెచ్ఐపి వెబ్ లింక్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ

క్షణాల్లో అంచెలంచెలుగా అధికారులకు సమాచారం

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడి

2లో

# నేడు గోదా కల్యాణం



**తిరుమల(జర్నలిస్ట్ ఫైల్) :** పవిత్రమైన ధనుర్మాసం ముగిసిన మరుసటి రోజైన జనవరి 15వ తేదీ గోదా కల్యాణం జరగనుంది. అత్యంత వైభవంగా వేడుకలను నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం ప్రాంగణంలో గల మైదానంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం గురువారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుందని టీటీడీ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల కోసం శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్వీబీసీ) ఈ వేడుకను ప్రత్యక్ష ప్రసారం చేయనుందని పేర్కొంది. ఈ పవిత్ర కార్యక్రమంలో భాగంగా

మిగతా 2లో...

## సాగునీటి ప్రాజెక్టులు, పోర్టు, ఎయిర్‌పోర్టుతో

# ఉత్తరాంధ్ర రూపురేఖలు మారుతున్నాయి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- కోటబొమ్మాళిలో సంక్రాంతి సంబరాలు
- తెలుగు జాతికి అతి పెద్ద పండగ సంక్రాంతి పండగ
- నియోజకవర్గంను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తాను




**కోటబొమ్మాళి, (జర్నలిస్ట్ ఫైల్):** "సంక్రాంతి పండగ అంటే ప్రతి ఒక్కరూ సొంత గ్రామానికి రావడానికి ప్రయత్నం చేస్తారు. మన సంస్కృతిలో సంక్రాంతి పండుగ ఎంతో కీలకం. మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొత్త ఒరవడికి శ్రీకారం దిద్దారు. ఆయన పుట్టినటువంటి సొంత గ్రామానికి వెళ్లి రెండు మూడు రోజుల పాటూ అక్కడే ఉండి సంక్రాంతి సంబరాలలో పాల్గొన్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళిలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు జాతికి అతిపెద్ద పండగ సంక్రాంతి అని, ఈ పండుగ మన సంస్కృతి–సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి అంటే సంస్కృతికి నిలయం. సంప్రదాయానికి పుట్టినిల్లు. అటువంటి సంస్కృతి సంప్రదాయం రానురానూ అంతరించి పోతున్నాయని అన్నారు.

**సాంస్కృతిక వైభవం కొనసాగిద్దాం... :** "గతంలో మనం సంక్రాంతిని చూశాం. సంక్రాంతి అంటే ధనుర్మాస ఆరంభ వేళ నుంచి నెలగంట పెట్టినప్పటి నుంచి గ్రామాలలో సందడి నెలకొని ఉంటుంది. గ్రామాలకు ఒక పండగ వాతావరణం వస్తుంది. ఇప్పుడు అందరం బిజీ అయిపోయాం. దాంతో సంప్రదాయాలకు కనుమరుగయిపోతున్నాయి. మళ్లీ మనందరి బాధ్యత పూర్వం రోజులకు రావాలి.

మిగతా 2లో...

# 'ఇరాన్‌ను వీడండి'..

- భారతీయులకు విదేశాంగశాఖ సూచన



**ఇరాన్ :** ఇరాన్‌లో చెలరేగిన అల్లర్లు తీవ్రరూపం దాల్చడంతో భారత్ అప్రమత్తమైంది. ఇరాన్‌లో నివసిస్తున్న భారతీయులు వెంటనే ఆ దేశాన్ని విడిచి తిరిగి స్వదేశానికి రావాలని ఆదేశించింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ అత్యవసర అడ్వైజరీ జారీ చేసింది. తాజా పరిణామాల దృష్ట్యా ఇరాన్‌కు ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. భారత పౌరులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా ఇరాన్‌ను వీడాలని పేర్కొంది. ప్రయాణానికి అవసరమైన పాస్‌పోర్ట్, ఐడీ కార్డు, ఇతర ఇమ్మిగ్రేషన్ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపింది.

ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు, భారత సంతతికి చెందిన వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వెల్లడించింది. నిరసన ప్రదర్శనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండాలని తెలిపింది. ఎలాంటి సహాయం కావాలన్న టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇరాన్‌లో చెలరేగిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో ఈ నెల 5న భారత విదేశాంగశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే పరిస్థితులు చేయి దాటిపోతుండటంతో అక్కడ నివసిస్తున్న భారతీయులకు విదేశాంగ శాఖ మరోసారి అడ్వైజరీ జారీ చేసింది.

ఇరాన్ కరెన్సీ రియాల్ రికార్డు స్థాయిలో పడిపోవడంతో గతేడాది డిసెంబర్‌లో టెహ్రాన్‌లో నిరసనలు ప్రారంభమయ్యాయి. ఆర్థిక ఇబ్బందులకు వ్యతిరేకంగా నిరసనకారులు ఆందోళన చేపట్టారు. అయితే, బుధవారం నాటికి ఈ నిరసనలు పూర్తిగా దిగజారిపోయాయి. దేశవ్యాప్తంగా మృతుల సంఖ్య 2,500 కంటే ఎక్కువగా ఉందని అమెరికాకు చెందిన మానవ హక్కుల కార్యకర్తల వార్తా సంస్థ పేర్కొంది. ఈ నిరసనల నేపథ్యంలో ఇరాన్?లో చదువుకుంటున్న డజన్ల కొద్దీ పాకిస్థాన్ విద్యార్థులు తిరిగి స్వదేశానికి చేరుకున్నట్లు పాక్ ఇమ్మిగ్రేషన్? అధికారి తెలిపారు.

మిగతా 2లో...

# అంతర్జాతీయ పండుగగా పొంగల్

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తరాయణ పుణ్య కాలం వేళ జరిగే సంక్రాంతి వేడుక అందరిలో సామాజిక ఐక్యతా భావాన్ని పెంచాలని, వికాసానికి బాటలు వేయాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తును సానుకూల దృక్పథం, ఆశావాదం, ఆత్మవిశ్వాసంతో చూడాలనే గొప్ప సందేశాన్ని సంక్రాంతి ఇస్తుందన్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల ప్రజలకు స్థానిక భాషల్లో పొంగల్/సంక్రాంతి శుభాకాంక్షలను తెలుపుతూ ప్రత్యేక లేఖలను ప్రధాని మోదీ రాశారు. చాలామంది జీమెయిల్ ఖాతాలకు ఈ లేఖలు అందాయి.

**పొంగల్ గిఫ్ట్ ప్యాక్‌లు, జల్లికట్టు పోటీలు :** పొంగల్ పండుగను తమిళనాడులో ఘనంగా జరుపుకుంటారు. ఈసందర్భంగా రాష్ట్రంలోని ప్రజలందరికీ పొంగల్ గిఫ్ట్ ప్యాక్‌లను డీఎంకే సర్కారు పంపిణీ చేస్తోంది. ఈ ప్యాక్‌లో 1 కేజీ ముడి బియ్యం, 1 కేజీ చక్కెర, 1 చెరకు గడ ఉంటాయి. దీంతోపాటు మదురై జిల్లాలోని అవనియాపురం, పాలమేడు, అలంగనల్లూర్‌లలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జల్లికట్టు పోటీలను నిర్వహిస్తారు. జనవరి 15 నుంచి జనవరి 17 వరకు ఈ పోటీలు జరుగుతాయి.

# మకరజ్యోతి దర్శనం

(మొదటి పేజీ తరువాయి)

సన్నిధానం మరియు చుట్టుపక్కల ప్రాంతాల్లో వేలాది మంది భక్తులు రోజులు తరబడి టెంట్లు వేసుకుని నిరీక్షించారు. వారిలో ఎక్కువ మంది కేరళ వెలుపల నుంచి వచ్చిన భక్తులే.

**41 రోజుల దీక్ష విరమణ :** అయ్యప్ప భక్తులు ఏటా 41 రోజులు దీక్ష చేసి శబరిమలకు వెళ్తారు. మకరజ్యోతిని దర్శించుకున్న తర్వాత అయ్యప్ప మాల వేసుకున్న స్వాములు దీక్షను విరమిస్తారు. తన భక్తులను ఆశీర్వదించడానికి సాక్షాత్తు ఆ అయ్యప్ప స్వామే స్వయంగా మకర జ్యోతిగా దర్శనమిస్తాడని నమ్మకం. ఈ జ్యోతి దర్శనం చేసిన వారికి జన్మరాహిత్యం కలిగి, నేరుగా భగవంతుడిని చేరుకుంటారని భక్తులు విశ్వసిస్తారు. పురాణాల ప్రకారం శబరిమల ఆలయాన్ని పరశురాముడు స్థాపించాడని నమ్ముతూ ఉంటారు. ఇక రామాయణంలో కూడా శబరిమల ప్రస్తావన ఉండటం గమనార్హం. రాముడు పంబా నదీ తీరంలోని శబరి ఆశ్రమానికి వెళ్లినట్లు చెబుతారు.

**భద్రతా ఏర్పాట్లు, కట్టుదిట్టమైన నియంత్రణ :** సోమవారం వరకు 51 లక్షల మందికి పైగా భక్తులు దర్శనం చేసుకున్నట్లు దేవస్థానం బోర్డు వెల్లడించింది. ఈ ఏడాది భద్రతా కారణాల దృష్ట్యా హైకోర్టు ఆదేశాల మేరకు భక్తుల సంఖ్యపై కఠిన నియంత్రణలు అమలు చేశారు. దీపారాధనకు ముందు 18వ మెట్లు, పరిసర ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు మకరజ్యోతి దర్శనానికి అనుకూలమైన పండితతావలం, శరంకుట్టి వంటి ప్రాంతాలకు తరలివెళ్లారు. నిలక్కల్, పంబ, ఎరుమేలి వంటి కేంద్రాల్లో రద్దీ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. దీపారాధన అనంతరం మాత్రమే పంబ నుంచి యాత్రికులను కొండ ఎక్కేందుకు అనుమతించారు. సన్నిధానం, శ్రీకోవెలను పూలతో అత్యంత అందంగా అలంకరించారు. ఫైర్‌ఫోర్స్ సిబ్బంది ఆలయ ప్రాంగణాన్ని శుభ్రపరిచి మకరవిళక్కు దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. దర్శనం అనంతరం మాత్రమే భక్తులను మల దిగేందుకు అనుమతించడంతో, పంబలో కేఎస్‌ఆర్‌టీసీ బస్సులు సహా అన్ని రవాణా సౌకర్యాలు సిద్ధంగా ఉంచారు.

**భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు :** ఇక మండల పూజ సమయంలో శబరిమల అయ్యప్ప దర్శనం కోసం క్యూలో వేచి ఉండే భక్తులకు బిస్కెట్లు, తాగునీరు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. చిన్నారులు, మహిళల కోసం ప్రత్యేక క్యూ వ్యవస్థను తీసుకొచ్చారు. దొంగల నుంచి భక్తుల రక్షణ కోసం ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను, మాలికప్పురంలోని అన్నదాన మండపంలో భక్తులకు తగినంత ఆహారం లభించేలా ఏర్పాట్లు చేశారు. శబరిమల కొండ ఎక్కేటప్పుడు కండరాల నొప్పితో బాధపడే యాత్రికులకు సహాయం చేయడానికి సన్నిధానంలో 24 గంటల ఉచిత ఫిజియోథెరపీ కేంద్రం పనిచేస్తుంది. పంబా, సన్నిధానంలో ఆఫ్ రోడ్ అంబులెన్స్?లు 24 గంటలు అందుబాటులో ఉంటాయి.

# నేడు గోదా కల్యాణం

(మొదటి పేజీ తరువాయి)

శ్రీకృష్ణస్వామి, శ్రీ ఆండాళ్ అమ్మవారి ఉత్సవ మూర్తులను వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో విశేషంగా అలంకరించి, అర్చకస్వాములు శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాన్ని నిర్వహిస్తారని వెల్లడించింది.

అధికారులు మాట్లాడుతూ ఈ వేడుకలో భాగంగా ఆధ్యాత్మికతను పంచేలా ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థులచే 'గోదా కల్యాణం' నృత్యరూపకాన్ని ప్రదర్శించనున్నారని తెలిపారు. గోదాదేవి శ్రీరంగనాథునిపై పెంచుకున్న భక్తిని చాటిచెప్పే ఈ ప్రదర్శన భక్తులను విశేషంగా అలరించనుందన్నారు. అనంతరం భక్తులందరూ కలిసి పాల్గొనే గోవిందనామ సంకీర్తనతో ఈ కార్యక్రమం మంగళప్రదంగా ముగుస్తుందని వెల్లడించారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లోని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ దివ్య కల్యాణాన్ని తిలకించి స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని టీటీడీ అధికారులు కోరారు. భక్తుల సౌకర్యార్థం మైదానంలో ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, ప్రసాదం పంపిణీకి అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను టీటీడీ ఇప్పటికే పర్యవేక్షిస్తోందని తెలియజేశారు.

# మహిళలపై దుష్ప్రచారం చేసేవారు చట్టం ముందు దోషులుగా నిలబడాల్సిందే



**తెలంగాణ :** మహిళల వ్యక్తిత్వంపై దాడి చేయడం క్రూరత్వమని, వారి గురించి దుష్ప్రచారం చేయడం నేరమని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అన్నారు. వీసీ సజ్జనార్ తాజాగా మాట్లాడుతూ. మహిళల వ్యక్తిత్వంపై దాడి చేయడం క్రూరత్వమని, వారి గురించి దుష్ప్రచారం చేయడం నేరమన్నారు. మహిళలపై దుష్ప్రచారం, దాడులు చేయడమంటే వారి పురోగతిని అడ్డుకోవడమేనని అన్నారు. మహిళలపై వ్యక్తిగతంగా దుష్ప్రచారం చేసేవారు చట్టం ముందు దోషులుగా నిలబడాల్సిందేనని హెచ్చరించారు.

**సీపీ సజ్జనార్ ట్వీట్ వైరల్... :** ప్రజా జీవితంలో విమర్శలు సహజమేనని. రాజకీయాలైనా, సామాజిక అంశాలైనా భిన్నాభిప్రాయాలు ఉండటం ప్రజాస్వామ్య లక్షణం అన్నారు సజ్జనార్ా కానీ మహిళలపై వ్యక్తిగత దాడులు చేయడం, వారి చరిత్రను కించపరచడం, అసభ్య వ్యాఖ్యలు చేయడం విమర్శలు అనిపించుకోవు అని అన్నారు. అలాంటి చర్యలు కేవలం క్రూరత్వం మాత్రమేనని, మహిళా అధికారులపై ఉద్దేశపూర్వక దుష్ప్రచారం చేయడం అత్యంత ఆందోళనకరమైన విషయం అన్నారు. వారిని వ్యక్తిగతంగా దెబ్బతీయడం, ప్రతిష్ఠను నాశనం చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని సజ్జనార్ పేర్కొన్నారు.

**మహిళా శక్తి - అపరిమితమైన గౌరవం :** ఒక మహిళ ప్రభుత్వ ఉద్యోగి అయినా, ప్రైవేట్ ఉద్యోగి అయినా, లేదా గృహిణి అయినా.. ఆమెకు అపరిమితమైన గౌరవం ఇవ్వాలి. నేటి మహిళ అన్ని రంగాల్లో ముందువరుసలో ఉండి నాయకత్వం వహిస్తోంది. పాలనలో, పోలీసు శాఖలో, శాస్త్ర సాంకేతిక రంగంలో, మీడియా రంగం సహా పలు రంగాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఒకవైపు ఇంటి పనులు, మరోవైపు ఉద్యోగం చేయడరా ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ ఎన్నో కనిపించని బాధ్యతలను భుజాన వేసుకుని మహిళలు కుటుంబాన్ని, సమాజాన్ని ముందుకు తీసుకెళుతున్నారని చెప్పారు. ఇలాంటి మహిళలపై దాడులు చేయడం అంటే సమాజ ప్రగతిపై దాడి చేయడమేనని సజ్జనార్ అన్నారు.

**భారతీయ సంస్కృతి, సామాజిక బాధ్యత.. :** మన భారత సాంప్రదాయం ఎప్పుడూ ఒకే సందేశాన్ని ఇస్తుందని.. "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవత్ణా" (ఎక్కడ మహిళలు పూజింపబడతారో, అక్కడ దేవతలు కొలువై ఉంటారు) అని సజ్జనార్ తన ట్వీట్లో గుర్తు చేశారు. మహిళలకు గౌరవం ఉన్న చోటే సుభిక్షంగా ఉంటుంది.

# గొల్లపూడిలో అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు



**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్):** గత ప్రభుత్వంలో జారీ చేసిన పట్టాదారు పాసుపుస్తకాలతో రైతులు ఎదుర్కొన్నక్షోభను త్యజించి వాటిని సంక్రాంతి భోగి మంటల్లో వేసి కొత్త ఆశలకు నాంది పలుకుతున్నారని సమాచార, పౌర సంబంధాలు మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతి వేడుకలు ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలోని గొల్లపూడి వన్ సెంటర్ వద్ద అత్యంత అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం తెల్లవారుజామున నిర్వహించిన భోగి వేడుకల్లో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. రైతుల జీవితాల్లో అనిశ్చితి, అవమానాలకు కారణమైన పాత పట్టాదారు పాసుపుస్తకాలను త్యజించి, ప్రభుత్వం రాజముద్రతో జారీ చేస్తున్న నూతన పట్టాదారు పాసుపుస్తకాలను స్వీకరించడం రైతులు ఆనందంతో ఉన్నారన్నారు. భోగి మంటలు అంటేనే చెడును విడిచి మంచిని ఆహ్వానించే సంప్రదాయానికి ప్రతీక అని అన్నారు. అదే భావంతో రైతులు తమ బాధాకర అనుభవాలకు ముగింపు పలుకుతూ కొత్త నమ్మకం, భరోసాతో ముందుకు సాగుతున్నారని మంత్రి పేర్కొన్నారు. రైతుల శ్రేయస్సే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యంగా ముందుకు వెళ్లుతుందన్నారు. సంక్రాంతి పండుగకు వేలాది మంది ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకి వచ్చి పండుగ చేసుకుంటారన్నారు. గత ప్రభుత్వంలో రైతులు చాలామంది రైతులు పట్టాదారు పుస్తకాల విషయంలో క్షోభ పడ్డారన్నారు. రైతుల ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం రాజముద్రతో కొత్త పట్టాదారు పుస్తకాలు అందిస్తుందన్నారు. రైతులు పాత పట్టాదార్ పాస్ పుస్కాలను భోగి మంటల్లో వేసి పండుగ జరుపుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మంచి పాలనను అందిస్తున్నారన్నారు. ధాన్యం డబ్బులను 24 గంటల్లో రైతు ఖాతాల్లో వేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు.. రాష్ట్రంలో యువతీయువకులకు మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కూటమి ప్రభుత్వం లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొస్తుందన్నారు. తెలుగు ప్రజల జీవితాల్లోని కష్టాలు భోగి మంటల్లో దగ్ధమై, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, శాంతి సమృద్ధి వెల్లివెరియాలని ఆకాంక్షించారు.. అందరి మనోభావాలను గతంలో దెబ్బతీసారని.. అలాంటి ఆలోచనలు మంటల్లో కాలిపోవాలని ఆశిస్తున్నానని మంత్రి కొలుసు పార్థసారథి తెలియజేసారు. శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో ప్రజలందరూ శాంతి, సుస్థిరతలతో సంక్రాంతి జరుపుకుంటున్నారు. భోగి మంటల్లో పాత పుస్తకాలను వేసి భోగి పండుగను జరుపుకుంటున్నారన్నారు. మైలవరం నియోజకవర్గ ప్రజలందరికీ భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉందని, ప్రతి కుటుంబంలో పండుగ వెలుగులు నిండాలని శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ ఆకాంక్షించారు. ముందుగా గొల్లపూడి వన్ టౌన్ సెంటర్ లో మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ లు కలిసి సంప్రదాయబద్ధంగా భోగి మంటలను వెలిగించారు.

# పీపీపీకి కేంద్రం గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

**కేంద్రం సూచనలు :** వైద్య సేవల డిమాండ్, లభ్యతల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూరించడానికి 5 అంశాలకు సంబంధించి పిపిపి విధానాన్ని అమలు చేయడంపై కేంద్ర ఆరోగ్య శాఖ పలు అంశాలకు సంబంధించి సూచనలు చేసింది.

న్యూక్లియర్ మెడిసిన్, సంచార వైద్య శాలలు, దంత వైద్య శాలలు, రేడియాలజీ సేవలు మరియు క్యాన్సర్ డే కేర్ సెంటర్లను విస్తరించడానికి పిపిపి విధానాన్ని అవలంబించాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సూచించింది.

ఎక్విప్, ఆపరేట్, మెయింటైన్ మరియు ఆపరేట్ అండ్ మెయింటైన్ మార్గాల ద్వారా పిపిపి విధానంలో సేవల లభ్యతను పెంచాలని కేంద్రం సూచించింది. 5 నుండి 10 సంవత్సరాల వరకు ప్రైవేట్ భాగస్వామి ఆయా సేవలందించడానికి అనుసరించాల్సిన చెల్లింపు విధానంపై కూడా కేంద్రం మార్గదర్శకాలను సూచించింది.

క్యాన్సర్, కార్డియో వాస్కులర్ మరియు నరాల వ్యాధులకు ఉత్తమమైన సేవల్ని న్యూక్లియర్ మెడిసిన్ ద్వారా రోగులకు అందించవచ్చని, ఈ సేవల లభ్యత ప్రస్తుత అవసరాల మేరకు, ముఖ్యంగా మధ్య, చిన్న స్థాయి నగరాల్లో బాగా తక్కువగా ఉన్నాయని, పిపిపి విధానంలో ఈ సేవల్ని విస్తరించడానికి తగు చర్యల్ని చేపట్టాలని కేంద్రం సూచించింది. క్యాన్సర్ వ్యాధి అతి శీఘ్రంగా విస్తరిస్తున్నందున సత్వరమే ఈ దిశగా చర్యల్ని చేపట్టాలని కేంద్ర ఆరోగ్య శాఖ రా(ష్టానికి సూచించింది. పెట్-సి.టి, స్పెక్ట్ ఇమేజింగ్, రేడియో థెరపీ సేవల్ని గ్రామాణ మరియు సెమీఅర్బన్ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాల్సిన అవసరముందని కేంద్రం స్పష్టం చేసింది. 60 శాతం నుండి 90 శాతం వరకు వివిధ వయస్కులు దంత సమస్యలతో బాధపడుతున్నా అవసరాల మేరకు వైద్య సేవలు లభించడంలేదని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో దంత వైద్య పరికరాలు, వైద్యుల లభ్యత తగు స్థాయిలో లేవని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పిపిపి ద్వారా దంత వైద్య సేవల్ని పటిష్టం చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ కోరింది. వ్యాధి నిర్ధారణలో ఎంతగానో ఉపకరించే ఎక్స్‌రే, సి.టి, ఎంఆర్ఐ యంత్రాల లభ్యతను విస్తృతం చేయాలని, అందుకు పిపిపి విధానం ఉపయోగపడుతుందని కేంద్రం తెలిపింది. క్యాన్సర్ మహమ్మారిపై యుద్ధంలో భాగంగా ముందస్తు స్క్రీనింగ్ మరియు వ్యాధి నిర్ధారణ కసం క్యాన్సర్ డేకేర్ సెంటర్ల ఏర్పాటుకు కూడా పిపిపి అనువైన విధానమని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. 2027-28 లోగా దేశ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నదే కేంద్రం లక్ష్యమని, ఈ దిశగా 2025-26 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ కు 14 సెంటర్ల మంజూరు చేశామని కేంద్ర ఆరోగ్య శాఖ లేఖలో పేర్కొంది. ఈ లేఖ వివరాలను కార్యదర్శి సౌరభ్ గౌర్ వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకొచ్చారు.

# సంక్రాంతి నుంచైనా జగన్ బుద్ధి మారాలి

(మొదటి పేజీ తరువాయి)



అమలవుతున్న సంక్షేమాన్ని చూసి జగన్ రెడ్డి ఓర్వలేకపోతున్నారని, ఈ భోగి నుంచైనా ఆయన బుద్ధి మారాలని ఆకాంక్షించారు. బుధవారం పెనుకొండ గవర్నమెంట్ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆర్డీవో ఆనందరావు పాల్గొన్నారు. ఎద్దుల బండ్ల పోటీలు, ముగ్గుల పోటీలను, ఇతర క్రీడలను మంత్రి వీక్షించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో ఆమె మాట్లాడారు. కుటుంబ సభ్యుల నడుమ సంక్రాంతి సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారన్నారు. పంట చేతికొచ్చిన సమయమని, రైతులు ఉత్సాహంతో సంక్రాంతిని జరుపుకుంటున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సంక్షేమ, అభివృద్ధి పాలనతో ప్రజల మరింత ఆనందంగా ఉన్నారన్నారు. ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూస్తోందన్నారు. సమర్థవంతమైన నాయకత్వంలో ఉన్న ఏపీకి భారీగా పెట్టుబడులు తరలొస్తున్నాయన్నారు. ప్రజలంతా ఆనందంగా ఉన్నా, ఒకరు మాత్రమే అసూయతో రగిలిపోతున్నారంటూ జగన్ పై ఆమె విమర్శలు గుప్పించారు. కొత్తదనాన్ని ఆహ్వానించడమే భోగి ఉద్దేశమని, ఈ పండగ నుంచైనా జగన్ బుద్ధి మారాలని కోరుకుంటున్నట్లు మంత్రి సవిత అన్నారు. అంతకుముందు మంత్రి సవిత సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడానికి క్యాంపు కార్యాలయం నుంచి జూనియర్ కళాశాల వరకూ ఎద్దుల బండిలో భారీ ర్యాలీగా వచ్చారు.

**ఘనంగా సంక్రాంతి సంబరాలు :** పెనుకొండ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన సంక్రాంతి ఘనంగా జరిగాయి. వందలాది మంది మహిళలు ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. మహిళలు అందమైన రంగవల్లులను అలంకరించారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు అకట్టుకున్నాయి. ఎద్దుల బండ్ల పోటీలు, ఇతర క్రీడా పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహం పాల్గొన్నారు. మంత్రి సవిత క్రీడాకారులను ప్రోత్సహించారు. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకున్న శ్రీదేవికి రూ. 10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన పద్మావతికి రూ. 5 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన అనసూయకు రూ. 5 వేలు అందజేశారు. ఇద్దరికి కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు సంక్రాంతి కానుకగా బహుమానాలు అందజేశారు. క్రీడలతో పాటు కోలాటం, చెక్కల భజన, గోరెవయ్యాల నాట్యం, పొట్టేళ్ల పందాలు, గాలిపటం ఎగరవేయడం, డోలు ప్రదర్శన వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి . ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు,అధికారులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

# అంటు వ్యాధుల గుర్తింపులో తొలిసారిగా ప్రజల భాగస్వామ్యం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** అంటు వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, తక్షణ చర్యలు తెసుకోవడంలో ప్రజలను కూడా భాగస్వాములు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది . ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం 'డిసీజ్ సర్వైలెన్ష ప్రోగ్రామ్ కింద రూపొందించిన ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్ ఫామ్ వెబ్ లింక్ ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు, స్వీకరిస్తామని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండియన్ తెలిపారు.

పరిసరాల అపరిశుభ్రత, మురుగునీటి డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, తాగునీటి కలుషితమవడం వంటి కారణాలతో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు మూకుమ్మడిగా వీరేచనాలు, వాంతులు వంటి అంటువ్యాధుల బారినపడుతున్నారు. ఈ తరహా ఘటనలు పలు సందర్భాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా సకాలంలో పైస్థాయి అధికారులకు చేరడంలో జాప్యం జరుగుతోంది. దీనిని అధిగమించే చర్యల్లో బాగంగా ప్రభుత్వం వ్యాదుల నియంత్రణలో ప్రజలను కూడా భాగస్వాములుగా చేయాలని నిర్ణయించినట్లు వీరపాండియన్ వెల్లడించారు.

వెబ్ లింక్ (https://ihip.mohfw.gov.in/cbs/#/campaign_idR202511) ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రజలు తమ ప్రాంతాల్లో ప్రబలుతున్న వ్యాధులు, వ్యాధుల ఉద్భతి గురించిన వివరాల నమోదుకు అవకాశాన్ని కల్పించారు . స్క్రీన్‌పై కనిపించే ఎంట్రీ ఫీల్డ్స్‌లో అవసరమైన సమాచారం నింపడంతో పాటు, సంబంధిత ఫోటోలను అప్లోడ్ చేసే సౌకర్యాన్ని కూడా ఇందులో కల్పించారు.

ప్రజలు నమోదు చేసిన సమాచారం క్షణాల్లోనే ఏఎన్ఎం, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి, జిల్లా అధికారులు, రాష్ట్ర స్థాయి అధికారులకు చేరుతుందని కమీషనర్ వివరించారు. ఈ అలర్ట్‌ల ఆధారంగా క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు అప్రమత్తమై వెంటనే అవసరమైన చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ఈ కొత్త అవకాశం ద్వారా ప్రజలు అంటువ్యాధుల నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## 'ఇరాన్‌ను వీడండి'..

(మొదటి పేజీ తరువాయి)



**ఇరాన్ న్యాయవ్యవస్థ అధిపతి కీలక వ్యాఖ్యలు:** మరోవైపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్?లో నిరసనకారులపై జరుగుతున్న క్రూరమైన అణచివేతను తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో టెహ్రాన్‌ను హెచ్చరించారు. నిరసనకారులకు మద్దతు తెలుపుతూ ఎక్స్?లో పోస్ట్? పెట్టారు. అయితే, నిరసనకారుల విషయంలో అమెరికా హెచ్చరికలు చేస్తున్నప్పటికీ ఇరాన్? మాత్రం తగ్గడం లేదు. దేశవ్యాప్త నిరసనల్లో అరెస్టయిన వారి విచారణ వేగవంతం చేయాలని, వారికి ఉరిశిక్షలు వేయాలని ఇరాన్ న్యాయవ్యవస్థ అధిపతి మొహ్సెనీ బుధవారం సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ఆన్‌లైన్‌లో పంచుకున్న ఒక వీడియోలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

"మనం ఒక పని చేయాలనుకుంటే, దాన్ని త్వరగా చేయాలి. ఒకవేళ రెండు నెలలు, మూడు నెలల ఆలస్యమైతే దాని ప్రభావం అలాగే ఉండదు. కాబట్టి మనం ఏదైనా చేయాలనుకుంటే, దాన్ని వేగంగా చేయాలి." అని పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌ను ఉరిశిక్షల గురించి హెచ్చరించిన ట్రంప్‌నకు, మొహ్సెనీ వ్యాఖ్యలు ఓ సవాలుగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది.

మరోవైపు, అర్థరహిత హత్యలను ఆపేవరకూ ఇరాన్ అధికారులతో తాను సమావేశం కాబోనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్? ట్రంప్ ఇదివరకే ప్రకటించారు. ఇరాన్ అధికారులతో తాను అన్ని సమావేశాలను రద్దు చేసుకుంటున్నానని మంగళవారం వెల్లడించారు. ఇరాన్‌లో మరణాలపై అధికారిక వివరాలు అందిన వెంటనే ఈ నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా పోరాటాన్ని కొనసాగించండని, సంస్థలను ఆధీనంలోకి తీసుకోండని పేర్కొన్నారు. ఇరాన్‌లో ఆందోళనలకు సంబంధించి ఎప్పటికప్పుడు అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్‌కు సమాచారం ఇస్తున్నామని విదేశాంగశాఖ మంత్రి అరాగ్చీ పేర్కొన్నారు. ఆందోళనలకు ముందు, తర్వాత, అలాగే ప్రస్తుత పరిస్థితులపై వివరాలను అందిస్తున్నామన్నారు. అయితే అమెరికా ఆలోచనలు, ప్రతిపాదనలు, హెచ్చరికలు మా దేశానికి సరైనవి కావని పేర్కొన్నారు.

## ఎగుమతుల్లో రాష్ట్రానికి ఐదో స్థానం

(మొదటి పేజీ తరువాయి)

రూ. 9,028 కోట్లు, పొగాకు రూ. 7,045 కోట్లు, బియ్యం రూ. 6,412 కోట్లు, షుగర్ రూ. 5,727 కోట్లు, మిరియాలు, క్యాప్సికం రూ. 5,582 కోట్లు, మోటర్ కార్స్ రూ. 5,518, ఫెర్రో మిశ్రమాలు రూ. 5,480 కోట్లు, పెట్రోలియం ఆయిల్స్ రూ. 5,238 కోట్లు ఎగుమతవుతున్నాయి. కాకినాడ నుంచి వంట నూనెలు, కెమికల్ ఇండిస్టీ, పెట్రోకెమికల్స్, విశాఖపట్నం నుంచి ఫార్మాస్యూటికల్స్, మెడికల్ పరికరాలు, ఇంజనీరింగ్, పారిశ్రామిక ఉత్పత్తులు, ప్రకాశం నుంచి కెమికల్ ఇండిస్టీ, ఇండిస్టియల్ పరికరాలు, అనంతపురం నుంచి ఆటోమొబైల్స్ ఎగుమతవుతున్నాయి.

# సాగునీటి ప్రాజెక్టులు, పోర్టు, ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారుతున్నాయి

(మొదటి పేజీ తరువాయి)

మళ్లీ పూర్వంలానే గ్రామీణ వాతావరణం తీసుకుని రావాలి. గ్రామాలలో ఉన్నవాళ్లంతా ఐకమత్యంగా ఇటువంటి సంబరాలు చేసుకున్నప్పుడే సంస్కృతి పునరుజ్జీవం సాధ్యం. ఇవాళ చాలా సంతోషంగా ఉంది. మీ అందరి అభిమానం అందుకోవడం ఆనందంగా ఉంది. ఈ ఏడాది రైతు వృద్ధి చెందాలి..కార్మికులు సంతోషంగా ఉండాలి అన్న సంకల్పంతో పనిచేస్తున్నాం. "

**సీఎంఆర్ఎఫ్ ద్వారా విస్తృత సాయం :** "ఇవాళ కూటమి ప్రభుత్వం నేతృత్వాన భూ సమస్యలు లేకుండా చేయాలని సీఎం కంకణం కట్టుకున్నారు. దీనిని మీ చేతికి మీ భూమి కార్యక్రమాన్ని రైతులంతా ఉపయోగించు కోవాలి. మన నియోజకవర్గంలో ఆర్థికంగా వెనుకబడి వైద్యం అందక అవస్థ పడుతున్నవారికి సీఎంఆర్ఎఫ్ తరపున సాయం అందిస్తున్నాం. చరిత్రలో ఎన్నడూ లేనంతగా 265 మందికి 3 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద డబ్బులు ఇచ్చాం, కార్యకర్తలారా ! మీరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఇందుకోసం మా ఆఫీసు లో ప్రత్యేకంగా పనిచేస్తుంది. సంతబొమ్మాళి మండలం, లక్కివలస మత్స్యకార గ్రామం ఇవాళ సీఎంఆర్ఎఫ్ కు ఏ దరఖాస్తు పెట్టినా ఆమోదం పొందుతోంది. ఇది ఒక మంచి పరిణామం. నా వరకూ వీలున్నంత ఎక్కువ మంది బాధితులకు సాయం అందించడమే ధ్యేయం.

**ఉత్తరాంధ్రకే మణిహారం భోగాపురం ఎయిర్ పోర్ట్ :** "విశాఖపట్టణానికి చిరకాలమైనటువంటి కోరిక రైల్వే జోను. గత ప్రభుత్వంలో మంజూరు చేసినా దానికి స్థలం ఇవ్వకపోవడం వల్ల జోన్ ఏర్పాటు ప్రక్రియ ఐదేళ్లపాటూ ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే జోన్ సమస్యను పరిష్కరించాం. 2025లో రైల్వే జోన్ కు శ్రీకారం చుట్టడమే కాదు ప్రారంభానికి సిద్ధంచేశాం. ఈ రోజు ఉత్తరాంధ్ర నుంచి చాలా మంది వలసలు వెళ్తున్నారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలని గూగుల్ సంస్థను ఇక్కడికి తీసుకుని వచ్చారు. విశాఖలో ల యాభై వేల కోట్ల రూపాయలతో గూగుల్ పెట్టుబడి. దీని వల్ల రెండు లక్షల ఉద్యోగాలు వస్తాయి. అలానే టీసీఎస్, కాగ్నిజెంట్ లాంటి విఖ్యాత సంస్థలను తీసుకుని వచ్చాం. మన ప్రాంతంలోనే మనం ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు 2025 సంవత్సరం ఉపయోగపడింది. అలానే ఉత్తరాంధ్ర కు మణిహారంగా భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం.



**కూటమి ప్రభుత్వంలో ఉత్తరాంధ్రుల కలల సాకారం... :** "ఇప్పటికే సంబంధిత పనులు పూర్తయాయి. ట్రయిల్ రన్ సక్సెస్ అయింది. 2017లో చంద్రబాబు నాయకత్వంలో 2500 కోట్ల రూపాయలతో 2500 ఎకరాల్లో భూసేకరణ చేసి భూమి పూజ చేశాం. తరువాత 2019లో గవర్నమెంట్ మారిపోయింది. దాంతో పనులు నిలిచిపోయాయి. మళ్లీ అధికారంలోకి వచ్చాక 2025లో చంద్రబాబు నాయుడు మార్గ నిర్దేశకత్వంలో యువ నాయకుడు రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకుని ఎనిమిది మాసాల ముందే భోగాపురం ఎయిర్ పోర్ట్ నిర్మాణం పూర్తి చేయించారు. మొన్ననే భోగాపురం ఎయిర్ పోర్టులో మొదటి విమానం ల్యాండ్ అయింది. "

**మూలపేట పోర్టు అందరికీ వరం :** "భావనపాడు పోర్టు..దీని పేరు మార్చారు. మూలపేటపోర్టుగా తీసుకుని వచ్చారు. 2025లో ప్రజల సహకారంతో 90 శాతం సీ పోర్టు పూర్తి చేయించాం. రేపటి వేళ ఏప్రిల్ లో మొదటి షిప్పు మూలపేటకు తీసుకుని వచ్చేందుకు కృషి. మూలపేట సీ పోర్టు నుంచి భోగాపురం ఎయిర్ పోర్టుకు ఆరు లైన్ల రహదారికి సంబంధించి డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు కూడా పూర్తైంది. అలానే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకుని 15 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టి మళ్లీ స్టీల్ ప్లాంట్ ను కాపాడుకోగలిగాం. "

**త్వరలో మరో అన్నా క్యాంటీన్ ప్రారంభం :** "2025 ఓ చారిత్రక సంవత్సరం. ఎన్నో మంచి పనులు చేశాం. ఈ ఏడాది వ్యాపారం బాగుందని సంబంధిత వర్గాలు నాతో చెప్పాయి. రైతులు బాగుండడంతో ఇదంతా సాధ్యం అయింది. అలానే రాజకీయంగా సహకరించని గ్రామాలకు సైతం అభివృద్ధి పనులు చేస్తున్నాం. 2025లో రెండు అన్నా క్యాంటీన్లకు శ్రీకారం చేశాం. కోటబొమ్మాళిలో ఇప్పటికే ఒకటి ప్రారంభం అయింది. మరొకటి మరో వారంలో టెక్కలిలో ప్రారంభం కానుంది. దీంతో టెక్కలి నియోజకవర్గానికి సంబంధించి నాలుగు మండలాల ప్రజలకూ ఉపయోగం. మొన్నటి వరకూ నందిగాం మండలం పలాస రెవెన్యూ డివిజన్లో ఉండేది. "

**టెంపుల్ టూరిజానికి ప్రత్యేక ప్రాధాన్యం**

ముఖ్య మంత్రి సహకారం.. చొరవతో టెక్కలి నియోజకవర్గ పరిధిలో తీసుకుని వచ్చాను. 2025 ఎన్నికల హామీని నెరవేర్చాను. కోటబొమ్మాళి డిగ్రీ కళాశాలకు అనుమతులు పునరుద్ధరించేందుకు కృషి చేసి సాధించాను. నాటి కుట్రలను ఛేదించాను. రేపటి ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా కోర్సులు పెట్టాలని ఆదేశించాను. అలానే టెంపుల్ టూరిజానికి ప్రాధాన్యం ఇచ్చి రావివలస ఎండల మల్లికార్జునుడి ఆలయానికీ, కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఆలయానికి ఎనిమిది కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించాను. డిజైన్ కూడా పూర్తైంది. అతి త్వరలోనే ఆధునికీకరణ పనులు చేపట్టనున్నాం. 2026 చాలా కీలకం. రైతు భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం. గత ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించింది. కానీ ఇవాళ సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తూ పనిచేస్తున్నాం. ఈ ఏడాది జనవరి నుంచి డిసెంబర్ వరకూ ఈ రాష్ట్రంలో ఉన్న భూ సమస్యలు పరిష్కరించాలని శపథం పూనారు. "

**తప్పుల్లేకుండా పాసు పుస్తకాలు జారీ**

"ప్రతి నెలా తొమ్మిదో తారీఖున భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించి సంబంధిత సమస్యలు తీర్చాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కొత్త పాసుపుస్తకాల పంపిణీ చేస్తున్నాం. అలానే వ్యక్తుల ఫొటోలతో కాకుండా రాజముద్రతో పాసుపుస్తకాలు పంపిణీ చేయనున్నాం. పాసు పుస్తకాలలో తప్పులు దిద్దే క్రమంలో భాగంగా బ్లాక్ చైన్ సిస్టమ్ ను తీసుకుని వస్తున్నాం. తద్వారా మీ ఫోన్ లోనే ఎక్కడ తప్పు జరిగిందో తెలుసుకునేందుకు వీలుగా ఓ చారిత్రక కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు శ్రీకారం దిద్దారు. రైతులు వీటిని ఉపయోగించుకుంటే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభ్యం అవుతుంది. "

**భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ**

"ఎందుకంటే భూమి అన్నది సెంటిమెంట్. దీనిని కేంద్రంగా చేసుకునే వివాదాలు నెలకొంటున్నాయి. గ్రామాలలో అశాంతి నెలకొంటోంది. వీటికి చెక్ పెట్టేందుకు సీఎంతో సహా అందరి మంత్రులూ దృష్టి సారిస్తున్నారు. వీటన్నింటినీ మీరు వినియోగించుకోవాలని కోరుతున్నాను. కూటమి ప్రభుత్వంలో రైతులే కాదు అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నాం. దీనిని మీరు గుర్తించాలి" మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్,టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## నున్నలో సంక్రాంతి ముగ్గుల పోటీలకు విశేష స్పందన

- మొదటి బహుమతి డబుల్ డోర్ రిఫ్రిజిరేట ర్‌ను కైవసం చేసుకుని దొంతిరెడ్డి తేజశ్వి

**విజయవాడ, జనవరి 14 (జర్నలిస్ట్ ఫైల్)**

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని విజయవాడ రూరల్ మండలం నున్నలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వికాస్ గ్రూపు ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ కాలేజీ రోడ్డులోని మామిడి తోటలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళలు, చిన్నారుల నుంచి విశేష స్పందన లభించింది. మహిళలతో పాటు చిన్నపిల్లలు కూడా ఉత్సాహంగా పాల్గొని ముగ్గుల పోటీల్లో తమలోని సృజనాత్మక ప్రతిభను వెలిబుచ్చారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ వంటి పండుగల విశిష్టతను ప్రతిబింబించేలా, భోగిమంటలు, గొబ్బిబ్బల ప్రత్యేకతలతో కూడిన రంగురంగుల ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి. నున్నలో సుమారు మూడు దశాబ్దాల అనంతరం ముగ్గుల పోటీలను నిర్వహించడంతో గ్రామ మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపించారు. విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు ప్రకటించడంతో ఈ కార్యక్రమానికి మరింత ఆదరణ లభించింది. సంక్రాంతి సంప్రదాయాలు, పండుగ రోజుల ప్రాముఖ్యతను చాటుతూ దొంతిరెడ్డి తేజశ్వి వేసిన ముగ్గు ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. ఆమెకు మొదటి బహుమతిగా డబుల్ డోర్ రిఫ్రిజిరేటర్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చిన రామారావు, నున్నా అధ్యక్షుడు మరియు సహకార సంఘం అధ్యక్షుడు కలకోటి శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు పామర్తి శ్రీనివాసరావు, గంపా శ్రీనివాస్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి మాదు శివరామప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. రెండో బహుమతిగా గ్రైండర్‌ను ఏ. చందన, బి. విజయలక్ష్మి జంట దక్కించుకోగా, మూడో బహుమతిగా మిక్సీని గ్రేస్ మేరీ కుమారి గెలుచుకున్నారు. ముగ్గులంటే ఏమిటో తెలియని చిన్నారులు సాన్వి, రుషిరఅబశ్రీశ్రీ ప్రత్యేకంగా పాల్గొనడంతో వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యఅబశ్రీశ్రీర్కారెడ్డి కోటిరెడ్డి, భూక్యా శ్రీనివాస్ నాయక్, తెలుగు యువత అధ్యక్షుడు మాదు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గగుడిలో అన్నదాన ప్రసాదాలు భేష్

- భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించిన చైర్మన్, ఈఓ పాలక మండలి సభ్యుల బృందం



**విజయవాడ, జనవరి 14 (జర్నలిస్ట్ ఫైల్)**

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం అన్నదాన భవనంలో నాణ్యత ప్రమాణాలను ఆలయ పాలకమండలి అధికారులు తనిఖీ చేశారు. అన్నదానం కార్యక్రమాన్ని పర్యవేక్షించిన బృందం, స్వయంగా భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించింది. అమ్మవారి ఆలయంలో భక్తులకు అందించే అన్న ప్రసాదాలు చాలా బాగున్నాయి అని భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.పర్యవేక్షణలో పాల్గొన్న అధికారులు, సభ్యులు..చైర్మన బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ , ట్రస్ట్ బోర్డు సభ్యులు ఆవరు శ్రీనివాస రావు, వై సుబ్రహ్మణ్య కుమార్‌సుకాసి సరిత ప్రత్యేక ఆహ్వానితులు బ్రహ్మమం, అన్నదానంలో వడ్డించే ఆహారం నాణ్యతను (క్వాలిటీ) బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. భక్తులతో భోజనం అధికారులు సభ్యులు భక్తుల పంక్తిలో కూర్చొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పరిశీలన అన్నదానంలో భాగంగా అందిస్తున్న అన్ని రకాల మెను వంటకాలను పరిశీలించారు. భక్తులు సిబ్బందితో నేరుగా మాట్లాడి, అన్నదాన సేవపై వారి అభిప్రాయాలు సూచనలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ తనిఖీ సమయంలో అన్నదానం ఏఈఓ సుధా రాణి, క్లర్క్ ప్రణీత్, కాంట్రాక్టర్ సబ్-స్టాఫ్ సిబ్బంది పాల్గొన్నారు. భక్తులకు మెరుగైన, నాణ్యమైన అన్నప్రసాదం అందించడమే లక్ష్యంగా ఈ పర్యవేక్షణ చేపట్టామని ఈఓ చైర్మన్ పేర్కొన్నారు. ఆలయంలో అన్న ప్రసాదాలను స్వీకరించిన భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. అన్నప్రసాదాల విభాగంలో అధికారులు, సిబ్బంది, భక్తులకు పూర్తిస్థాయి సదుపాయాలు కల్పిస్తున్నారని భక్తులు పేర్కొన్నారు.

## మాజీమంత్రి అప్పల సూర్యనారాయణవి ఆదర్శ రాజకీయాలు : సీఎం చంద్రబాబు

- గుండ కుటుంబ సభ్యులకు ఫోన్లో సీఎం పరామర్శ
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలకు ముఖ్యమంత్రి ఆదేశం

**నారావారిపల్లి, జనవరి 14 (జర్నలిస్ట్ ఫైల్)**

మాజీమంత్రి గుండ అప్పలసూర్యనారాయణ ఆదర్శవంతమైన రాజకీయాలు చేశారని, పార్టీకి ఆయన చేసిన సేవలు ఎప్పుడూ మరిచిపోనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గుండ కుటుంబం పట్ల తనకు అత్యున్నత గౌరవం ఉందని తెలిపారు. తలకు గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అప్పల సూర్యనారాయణ నిన్న ప్రాణాలు విడిచారు. శోకసంద్రంలో ఉన్న గుండ సభ్యులతో సీఎం చంద్రబాబు ఫోన్లో మాట్లాడి పరామర్శించారు. ఈ సందర్భంగా అప్పల సూర్యనారాయణతో తనకు ఉన్న అనుబంధాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నా ఎప్పుడూ ఆయన సాధారణ జీవితం గడిపారని అన్నారు. నిజాయితీగా ఎంతో ఆదర్శవంతమైన రాజకీయాలు చేశారని కొనియాడారు. శ్రీకాకుళం అభివృద్ధికి నిరంతరం తపన పడ్డారని సీఎం చంద్రబాబు అన్నారు. మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలకు సీఎం చంద్రబాబు ఆదేశించారు. అంత్యక్రియలకు పార్టీ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు హాజరు కావాలని సూచించారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## సిడ్నీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో వైభవంగా సంక్రాంతి సంబరాలు

**పెద్దఅవుటపల్లి, జనవరి 14 (జర్నలిస్ట్ ఫైల్)**

ఉంగుటూరు మండలం, పెద్ద అవుటపల్లి గ్రామంలో తెలు గువారి అతిపెద్ద పండుగ సంక్రాంతిని పురస్కరించుకుని, స్థానిక పెద్ద అవుటపల్లిలోని సిడ్నీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 'సంక్రాంతి సంబరాలు' అత్యంత వేడుకగా నిర్వహించారు. విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన కల్పించేలా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం అందరినీ అలరించింది. ఈ వేడుకలకు ప్రొబేషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డీ. సురేఖ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శాంతి, ప్రిన్సిపాల్ మార్గరెట్ ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. అలరించిన సాంస్కృతిక కార్యక్రమాల ుపాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం ఉట్టిపడేలా విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో చేసిన కోలాటం, జానపద నృత్యాలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. చిన్నారులకు భోగి పళ్ళు పోయడం, గాలిపటాలు ఎగురవే యడం, పొంగలి వండటం వంటి కార్యక్రమాల ద్వారా పండుగ ప్రాము ఖ్యతను వివరించారు. లసంబరాల్లో భాగంగా ముందు రోజు విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ముఖ్య అతిథి డీ. సురేఖ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని పిల్లల ప్రదర్శనలను తిలకించారు. పండుగ సంస్కృతిని నేటి తరానికి అందించడంలో పాఠశాల యాజమాన్యం తీసుకుంటున్న చొరవను వారు అభినందించారు. విద్యార్థుల ఉత్సాహం, కిలకిలరావాల మధ్య సంక్రాంతి సంబరాలు ఉల్లాసంగా, ఉత్సాహంగా ముగిశాయి.



## దిరిసినపల్లి వెలి ఘటనలో ఎస్సీఎస్టీ నుండి కలెక్టర్‌కు నోటీసులు అందాయి

- బాధితురాలు గంగాభవాని

**రంపచోడవరం, జనవరి 14 (జర్నలిస్ట్ ఫైల్)**

తమ కుటుంబాన్ని గ్రామానికి చెందిన కొంతమంది గ్రామపెద్దలు వెలి వేస్తున్నట్లు ప్రకటించిన ఘటనపై జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ (ఎస్సీఎస్టీ) నుండి అప్పటి అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ పేరిట నోటీసులు అందినట్లు తమకు పోస్ట్ ద్వారా సంబంధించిన కాపీలు అందాయని రంపచోడవరం మండలం దిరిసినపల్లి గ్రామానికి చెందిన బల్లెం గంగాభవాని పత్రికాప్రకటన ద్వారా తెలిపారు. దిరిసినపల్లి,నరసాపురం గ్రామాల పరిధిలో నల్లరాయి క్వారీల వల్ల తమ ఇళ్ళు పాడైపోతున్నాయని విచ్చలవిడిగా బ్లాస్టింగ్ చేయడంవలన దుమ్ము, ధూళితో పంటపొలాలు నాశనం కావడం, భూమి అదరడం వలన ఇళ్ళతోపాటు ఇంట్లోని వస్తువులు పాడవుతున్నాయంటూ దిరిసినపల్లి గ్రామానికి చెందిన బల్లెం గంగాభవాని మరికొంతమంది బాధితులు గత నవంబరు 17 నఅబశ్రీశ్రీరంపచోడవరం పీఓ కు ఫిర్యాదు చేసి,సమస్యపై పోరాటం చేస్తున్నందుకు క్వారీ నిర్వాహకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్న కొందరు గ్రామపెద్దలు తమ కుటుంబాన్ని బెదిరిస్తు, మానసికంగా హింసించడమే కాకుండా గత నవంబరు 19 న తమ కుటుంబాన్ని వెలి వేస్తున్నట్లు ప్రకటించారని,దీనిపై పోలీసు స్టేషన్లోను, ఐటిడిఎ లో, జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ నందు ఎస్పీ కి పలుమార్లు ఫిర్యాదుచేశామని అయినా తగు చర్యలు లేకపోవడంతో ఢిల్లీలోని జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ కు ఫిర్యాదు చేశామని గంగాభవాని చెప్పారు.తమ ఫిర్యాదుకు స్పందించిన కమిషన్ ఘటనపై 30 రోజుల్లో విచారణ జరిపి నివేదిక అందజేయాలని జిల్లాకలెక్టర్ కు నోటీసులు జారీచేసినట్లు తమకు పోస్ట్ ద్వారా సమాచారం అందిందని గంగాభవాని తెలిపారు.ఇప్పటికైనా తమకు న్యాయం జరుగుతుందని గంగాభవాని ఆశాభావం వ్యక్తంచేశారు. తమకు అండగా నిలిచిన ఆదివాసి నాయకులపై గత నవంబరు 24 న జరిగిన దాడిపైనా జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ కు ఫిర్యాదు చేసి వున్నామని ఈ సందర్భంగా గంగాభవాని తెలిపారు.



## జిల్లాలో ఎటువంటి ఎరువుల కొరతా లేదు

- ప్రతిపక్షాలు కావాలని వదంతులు సృష్టించి రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి
- చాట్రాయి నరసింహరావుపాలెం లో ఎరువుల నిల్వలను ఆకస్మికంగా తనిఖీ చేసిన రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



**ఏలూరు, జనవరి 14 (జర్నలిస్ట్ ఫైల్)**

జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరతా లేదని రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. చాట్రాయి మండలం నరసింహం ావుపాలెం లోని ప్రాధమిక వ్యవసాయ పరపతి సంఘాల గోడౌన్ ను, ఎరువుల దుకాణాలను మంత్రి మంగవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్లలో ఉన్న ఎరువుల నిల్వలు, రిజిస్టర్లను మంత్రి పరిశీలించారు. అక్కడకు వచ్చిన రైతులను వారి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. చాట్రాయి మండలం మరియు నరసింహరావుపాలెం లో రైతులకు అవసరాలకు సరిపడిన ఎరువుల నిల్వలు ఉన్నాయని, ఇంకా అవసరమైతే ఎరువులను అందుబాటులోకి తీసుకువస్తామని, ఎరువుల విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్ద న్నారు. కొందరు కావాలని ఎర ువుల కొరత ఉందని వదంతులను సృష్టిస్తున్నారని, రైతులు వాటిని నమ్మవద్దన్నారు. రైతుల సంక్షే మం కోసమే ప్రభుత్వం పనిచేస్తు ందని, రైతుల సమస్యలను ముందుగానే తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వం ఎప్పుడూ ముందు ఉంటుంద న్నారు. జిల్లాలో ఎటువంటి ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోమని వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించడం జరిగిందని, అధికారులు కూడా 10 రోజులకు సరిపడా ఎరువుల నిల్వలను బఫర్ స్టాక్ గా నిల్వ ఉంచుతూ, ఎక్కడైనా ఎరువుల కొరతను ముందుగానే గుర్తించి అక్కడకు వెంటనే ఎరువులను సరఫరా చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎరువులను మంత్రి స్వయంగా ఎరువులకు అందించారు. మంత్రి వెంట వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాషా, రెవిన్యూ, వ్యవసాయ శాఖాధికారులు ఉన్నారు.

## కొత్తూరు తాడేపల్లిలో ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ సంక్రాంతి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం

- గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 13 ఏళ్లగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీల నిర్వహణ
- కృష్ణా జిల్లా కబడ్డీ లీగ్ మాజీ అధ్యక్షుడు చలపాటి వెంకటేశ్వరరావు



**విజయవాడ, జనవరి 14 (జర్నలిస్ట్ ఫైల్)**

సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా ఈడా వేదాద్రి ఇంజనీర్స్ (ఈవీఈ) ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో మూడు రోజుల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామీణ క్రీడా ప్రతిభను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ గత 13 సంవత్సరాలుగా ఈ టోర్నమెంట్‌ను నిరంతరంగా నిర్వహిస్తోంది.కృష్ణా జిల్లా కబడ్డీ లీగ్ మాజీ అధ్యక్షుడు, ఈ-జోన్ చైర్మన్ చలపతి వెంకటేశ్వరరావు (సిహెచ్) ప్రారంభ మ్యాచ్ ఆడి టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంభించారు. సబ్ జూనియర్, జూనియర్ మరియు సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో సుమారు 50 జట్లు పాల్గొంటున్నాయి. ఆటగాళ్లు, ప్రేక్షకుల ఉత్సాహభరిత పాల్గొనడం గ్రామంలో సంక్రాంతి పండుగ స్ఫూర్తిని మరింత ఉజ్జీవింపజేసింది.ఈ సందర్భంగా చలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలని, క్రీడలు మంచి ఆరోగ్యం, క్రమశిక్షణతో పాటు మానసిక దృఢత్వాన్ని అందిస్తాయని అన్నారు. యువత అనారోగ్యకరమైన అలవాట్లకు దూరంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో దోహద పడతాయని పేర్కొన్నారు. 13 ఏళ్లుగా క్రీడా కార్యక్రవాలను విజయవంతంగా నిర్వహిస్తున్న ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్‌ను ఆయన అభిన ందించారు.ఈవీఈ ఫ్రెం డ్స్ సర్కిల్ అధ్యక్షుడు ఈడా వేదాద్రి మాట్లాడుతూ, యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా క్రీడల వైపు మళ్లించాలనే ఉద్దేశంతో సంక్రాంతి మూడు రోజులపాటు ఈ టోర్నమెంట్ ను నిర్వహిస్తు న్నామని తెలిపారు. గ్రామీణ క్రీడా కారులను ప్రోత్సహించేందుకు డబుల్స్ ఈవెంట్లను అన్ని విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ టోర్నమెంట్ ద్వారా క్రీడా ప్రయాణం ప్రారంభించిన పలువురు ఆటగాళ్లు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం తమకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా వీరంకి రామచంద్రరావు, మడు శివయ్య, పలగాని రాజేశ్వరరావు హాజరై, పాల్గొన్న క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు.

# షాద్ నగర్ వేదికగా బహుజనుల ఆత్మగౌరవ బహిరంగ.

**విలేకరుల సమావేశంలో పల్నాటి రాములు.**

**బహుజన్ సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కోరుతున్నాం.**





ఇబ్రహీంపట్నం జనవరి 14 (జర్నలిస్ట్ ఫైల్) : భావి భారత ప్రధాని ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వర్యులు బడుగు బలహీన వర్గాల దిక్సూచి అక్క బెహెన్ జి కుమారి మాయావతి 70 వ జన్మదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్రంలో బహుజనుల ఆత్మగౌరవ సభ ఈ నెల 15వ తేదిన జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చెయ్యాలని ఎల్ బి నగర్ బీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఇంచార్జి పల్లాటి రాములు మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లా, షాద్ నగర్ వేదిక గా 15వ తేది నాడు జరిగే బహిరంగ సభ తెలంగాణ ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా జనసమీకరణ జరగాలని పిలుపునిచ్చారు ప్రతీ నాయకుడు జనసమీకరణ చేసి సభను జయప్రదం చెయ్యాలి అని కోరారు ఈ కార్యక్రమం లో రంగా రెడ్డి జిల్లా ఇంచార్జి బండారు రవి కుమార్ ముదిరాజ్, జిల్లా జనరల్ సెక్రటరీ నితిన్ కిషోర్ జిల్లా కార్యదర్శి గ్యార మల్లేష్ జిల్లా మహిళ కన్వీనర్ కంబాలపల్లి శాంత జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యంజాల ప్రహ్లాద్ బీఎస్పీ ఎల్ బి నగర్ ఇంచార్జ్ లు మంత్రి జగన్ సాయిరాం కృష్ణ ముదిరాజ్ అధ్యక్షులు వి సంపత్ సెక్రటరీ కుమార్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇంచార్జ్ లు వంగాల కృష్ణ ప్రసాద్, బంగరిగళ్ళ మహేందర్ లు,అధ్యక్షులు గుండె శ్రీనివాస్ బి వి ఎఫ్ కన్వీనర్ అజయ్ కుమార్ మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ కేతావత్ బహుగుణ నాయక్ అధ్యక్షులు లక్ష్మి రాజు ప్రధాన కార్యదర్శి సురేందర్ సీనియర్ నాయకులు చిత్రం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కాటేదాన్ లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు ప్రధానం:పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

**ముగ్గులకు సంస్కృతి సంప్రదాయాల్లో ఎంతో విశిష్టత ఉంది:పట్లోళ్ల కార్తీక్ రెడ్డి.**



రాజేంద్రనగర్, జనవరి 14 (జర్నలిస్ట్ ఫైల్) : రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధి మైలార్దేవపల్లి డివిజన్ కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని మైలార్దేవపల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీలలు ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హాజరయ్యారు.ముగ్గుల పోటీలు సందర్భంగా



మన సంప్రదాయాలను గౌరవిస్తూ,మహిళలు అత్యంత ఉత్సాహంతో ఈ పోటీల్లో పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు.ఈ సందర్భంగా మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి,ముగ్గల పోటీలో పాల్గొన్న అందరికి కార్తీక్ రెడ్డి బహుమతులు అందిచడం జరిగింది.అత్యుత్తమ ముగ్గులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ..రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలకు భోగి సంక్రాంతి కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజల జీవితంలో నిత్యం వెలుగు వెరిజిల్లాలని ఆ దేవుని కటాక్షం ప్రజలపై ఉండాలని,ఆనందంగా పండగలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.అదేవిధముగా సంక్రాంతి పర్వదినం సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం పట్ల వెంకటేష్ ను అభినందించారు.బహుమతులు గెలుచుకున్న విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా సోదరీమణులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి,డి.రమేష్ ముదిరాజ్,నోముల రాము యాదవ్,అక్కేమం రఘు యాదవ్,బండ రాజేష్ యాదవ్,ఉప్పల్ శ్రీను,ప్రవీణ్,సన్నీ,సునీల్,పోతరాజు రమేష్,కే.లక్ష్మీ,సరిత,భూదేవి రెడ్డి,సుగుణమ్మ,లక్ష్మి ప్రసన్న, పుష్ప,లలిత,శిరీష,సారిక,కృష్ణవేణి,మైసిరెడ్డి గంజి రాజు,సమ్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఎర్లపల్లి ప్రవీణ్,మహేందర్ ముదిరాజ్,కొంపల్లి జగదీష్, నరేష్ యాదవ్,అశోక్,నానీ, మధు చారి,కృష్ణ ముదిరాజ్, నాయకులు కార్యకర్తలు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు విద్యుత్ భారాన్ని తగ్గించడానికే గృహజ్యోతి పథకం

**ఆరుట్లలో 1700 కుటుంబాలకు గృహజ్యోతి ద్వారా లబ్ది**

**ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్.**



ఇబ్రహీంపట్నం జనవరి 14 (జర్నలిస్ట్ ఫైల్) : మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో పేదలకు విద్యుత్ భారాన్ని తగ్గించడానికే ప్రభుత్వం గృహజ్యోతి పథకం తీసుకొచ్చిందని గృహజ్యోతి పథకం ద్వారా లక్షలాది నిరుపేదల ఇంట్లో వెలుగులు నిండుతున్నాయని ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ అన్నారు మంగళవారం రోజున తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ శాఖ వారు పేదప్రజలకు అందజేస్తున్న సున్నా బిల్లు ప్రొసిడింగులను లబ్దిదారులకు అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించి సామాన్యులపై ఆర్థిక భారం తగ్గించిందని వాడే ఆరుట్ల గ్రామంలో 1700 కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ది పొందుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ చెరుకు నర్సింహా కంబాలపల్లి బుగ్గరాములు కాంగ్రెస్ పార్టీ నాయకులు మేగవత్ లక్ష్మానాయక్ దానరమోని రమేష్ వెదిరే రమణారెడ్డి మార సురేష్ అంతటి రాజుగౌడ్ కావలి రమేష్ మానిపాటి వెంకటేష్ ఎన్నిదుల సురేష్ సుంకరి ప్రవీణ్ గౌడ్ మద్దెల బాలరాజు నూకం బాలరాజు మంద దనేందర్ రెడ్డి నూకం మల్లేష్ ఆర్ల శ్రీకాంత్ మార పర్వతాలు ఆడెపు మధు దండ వెంకన్న మరియు విద్యుత్ శాఖ అధికారులు వెంకటేష్ గృహజ్యోతి లబ్దిదారులు ప్రజాగలం భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ కి వినతి పత్రం అందజేసిన టీఎన్జీవో అధ్యక్షుడు సుమన్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి 14 (జర్నలిస్ట్ ఫైల్) : ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్,టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్,టిఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ ఆధ్వర్యంలో ఐడిఓసి కార్యాలయంలో జిల్లా మెజిస్ట్రేట్,కలెక్టర్ ఇలా త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించి,వినతిపత్రం అందజేయగా సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినందుకు జిల్లా కలెక్టర్ కి టీఎన్జీవోస్ పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసిన టిఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యవర్గ బృందం,టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్,జిల్లా ఉపాధ్యక్షులు జాఫర్ హుస్సేన్,జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి,టిఎన్జీవో ముఖ్య సలహాదారులు వనమాల సుధాకర్ పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ప్రారంభమైన నిరి9 అంతర్జాతీయ చలన చిత్రోత్సవం 2025 ..

**రెండు రోజుల సినిమా వేడుకలు ప్రారంభం**




(జర్నలిస్ట్ ఫైల్) హైదరాబాద్ ప్రతినిధి.. సినిమా, సృజనాత్మకత శక్తివంతమైన కథనం లకు సంబంధించిన రెండు రోజుల ఉత్సాహభరితమైన వేడుకకు నాంది పలుకుతూ, హైదరాబాద్‌లోని రాజ్ భవన్ సంస్కృతి ఆడిటోరియంలో నిరి9 అంతర్జాతీయ చలనచిత్రోత్సవం యొక్క మూడవ ఎడిషన్ ఈరోజు విజయవంతంగా ప్రారంభించబడింది. ఈ గొప్ప ప్రారంభోత్సవ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఉన్న చలన చిత్రనిర్మాతలు, కళాకారులు, సాంస్కృతిక ప్రముఖులు, సినిమా ప్రేమికులను ఒకచోట చేర్చి, ఉత్సవానికి స్ఫూర్తిదాయకమైన స్వరాన్ని అందించింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రముఖ జాతీయ అవార్డు గ్రహీత, బాలీవుడ్ నటి సీమా బిశ్వాస్, తెలుగు చిత్ర దర్శకుడు ఎస్.వి.కృష్ణారెడ్డి, ప్రముఖ గాయని , సాంస్కృతిక చిహ్నం లౌ మాజా,అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన నటి కార్లిటామొహిని, గౌహతి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి శ్రీ అజిత్ బోర్తాకూర్, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.ఎల్.ఆర్. కిషోర్ బాబు, తెలుగు, అస్సామీ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ చిత్రనిర్మాతలు, దర్శకులు, సృజనాత్మక నిపుణులు పాల్గొన్నారు. తద్వారా, ఈ ఉత్సవం




ప్రారంభ దినోత్సవానికి అపారమైన గౌరవమును జోడించారు.ఈ సందర్భంగా నిరి9 అంతర్జాతీయ చలనచిత్రోత్సవం యొక్క అధికారిక సావనీర్‌ను సినిమాటోగ్రఫీ మంత్రి కె. వెంకట్ రెడ్డి వీడియో సందేశం ద్వారా విడుదల చేశారు, ఈ సావనీర్‌ను జితు రాయ్‌మేధి ఎడిట్ చేశారు. ఈ ఉత్సవాలు ఒక అద్భుతమైన సాంస్కృతిక అనుభవాలు. ప్రారంభోత్సవంలో కూచిపూడి మరియు సత్రియా నృత్య రూపాలు ప్రదర్శించబడ్డాయి, తరువాత అస్సామీ గాయని మనీషా బోర్డోలోయ్ తెలుగు, అస్సామీ భాషలలో ఆధ్యాత్మిక గీతాలు ఆలపించారు. తద్వారా వైవిధ్యానికి సంబంధించిన రెండు రోజుల చలనచిత్ర వేడుకకు నాంది పలికారు. ఈ చలనచిత్ర వేడుక భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుండి విదేశాల నుండి పలు చిత్రాలను ఒకచోట చేర్చింది.తన స్వాగతోపన్యాసంలో, ఫెస్టివల్ డైరెక్టర్ డాక్టర్ జున్మని దేవి ఖౌండ్ మాట్లాడుతూ, "కథలకు స్వస్థపరిచే, ప్రశ్నించే, ఏకం చేసే శక్తి ఉంటుందనే నమ్మకంతో నిరి9 అనే వేదిక ఆవిర్భవించింది. ఈ ఉత్సవం కేవలం సినిమాల గురించి మాత్రమే కాదు, వినబడటానికి అర్హత ఉన్న స్వరాల గురించి , స్థానం అవసరమైన కథనాల గురించి" అని అన్నారు. ఈ ఉత్సవాన్ని సాధ్యం చేసిన మద్దతుదారులు, సహకారులు, కళాకారులు, భాగస్వాము లందరికీ డాక్టర్ ఖౌండ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు, అదే సమయంలో ఈ సినిమా వేడుకకు హైదరాబాద్‌కు వచ్చిన ప్రముఖులు, చిత్రనిర్మాతలు, అతిథులందరినీ హృదయపూర్వకంగా స్వాగతించారు. రెండు రోజుల పాటు, హైదరాబాద్‌లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్‌లో ఫీచర్ ఫిల్మ్, షార్ట్ ఫిల్మ్, షార్టర్ ఫిల్మ్ మరియు డాక్యుమెంటరీతో సహా బహుళ విభాగాలలో ఎంపిక చేయబడిన చిత్రాలు పోటీపడతాయి. మొదటి రోజు మరియు 2వ రోజు అధికారికంగా ఎంపిక చేయబడిన దహిని, జుయిఫుల్, కుహిపత్, ఘర్, ధోంగులోయి, ది ఎలిఫెంట్ హెవెన్, గోల్డెన్డ్రెడ్, పాపా, చోరి, ఇలిష్, అబాసేషాట్, మనితాశుభవం, క్యారెక్టర్, బియాండ్ ది అన్‌ఫినిష్డ్, ది అగ్లీ గ్రీన్ ప్లానెట్, ఓమ్నిప్రెజెంట్, శేష్ చితి, పా పోటీ విభాగంలో మరియు విమర్శకుల ప్రశంసలుపొందిన చిత్రం ' కూకీ' , అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన ఫీచర్ ఫిల్మ్ ' ది వాయిస్ ఆఫ్ హింద్ రజబ్ల వంటి సినిమాల వరుస ప్రదర్శనలు ఉంటాయి.ప్రపంచవ్యాప్తంగా చలనచిత్ర నిర్మాతలకు స్ఫూర్తినిచ్చేలా నగదు అవార్డులను అందించే 15 చలనచిత్రోత్సవాలలో ఈ ఉత్సవం ఒకటి.ఈ ఉత్సవంలో రూ. 4,30,000 నగదు బహుమతులు, ప్రత్యేక గుర్తింపులు , వ్యక్తిగత అవార్డులతో పాటు ప్రదానం చేస్తారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గౌరవం, ఉత్తమ చలనచిత్రంగా డాక్టర్ జుబీన్గార్గ్ స్మారక అవార్డును ఈ ఉత్సవంలో అత్యుత్తమ చలనచిత్రానికి ప్రదానం చేస్తారు.ఈ వేడుకలో పాల్గొనేవారు, ప్రేక్షకులలో అపారమైన ఆసక్తితో, జనవరి 11న జరిగే 2వ రోజు మరింత పెద్దదిగా ఉంటుందని హామీ ఇస్తుంది.మరింత ఆకర్షణీయమైన ప్రదర్శనలు, ఇంటరాక్టివ్ సెషన్‌లు ఉంటాయి. తెలుగు అస్సామీ హిందీ చలనచిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ కళాకారులు, దర్శకులు, నిర్మాతలతో పాటుగా తెలంగాణ ప్రభుత్వం తరపున బాధ్యత వహించే సంబంధిత ప్రభుత్వ అధికారులు పాల్గొనగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అవార్డుల వేడుక కూడా ఉంటుంది, ఎందుకంటే నిరి9 అంతర్జాతీయ చలనచిత్రోత్సవం అనుసంధానించే, సవాలు చేసే , పరివర్తన చెందే సినిమాను వేడుక జరుపుకోవడం కొనసాగిస్తోంది అని తెలిపారు.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ



(జర్నలిస్ట్ ఫైల్) హైదరాబాద్, జనవరి 14 : కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న నేషనల్ స్కిల్ అకాడమీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానించింది. ఇంటర్మీడియట్ పాస్, ఇంజనీరింగ్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ మరియు పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులు, అలాగే వివిధ రంగాలలో పనిచేస్తున్న ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చు. వేగంగా విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో విద్యార్థులు మరియు పని చేసే నిపుణులను అధునాతన నైపుణ్యాలతో సన్నద్ధం చేయడమే లక్ష్యం. అకాడమీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఢ మెషిన్ లెర్నింగ్‌లో డిప్లొమా, పిజి డిప్లొమా మరియు మాస్టర్ ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. శిక్షణ ఆన్‌లైన్‌లో నిర్వహించబడుతుంది. తర్వాత పరీక్షలు ఉంటాయి. విజయవంతమైన అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆమోదించిన సర్టిఫికెట్లు ప్రదానం చేయబడతాయి. కోర్సుల వ్యవధి ఐదు నుండి పది నెలల వరకు ఉంటుంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్, హెల్త్‌కేర్, ఫైనాన్స్, ఇంజనీరింగ్, మీడియా, మార్కెటింగ్, ప్రభుత్వం, రక్షణ, వ్యవసాయం, రిటైల్, గేమింగ్ మరియు విద్య వంటి రంగాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషిస్తుండటంతో, నైపుణ్యం కలిగిన ఏఐ నిపుణులకు డిమాండ్ వేగంగా పెరుగుతోంది. కేంద్ర ప్రభుత్వ థింక్ ట్యాంక్ అయిన నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, రాబోయే ఐదు సంవత్సరాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా 40 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు సృష్టించబడతాయని భావిస్తున్నారు. ఈ కోర్సులు పూర్తి చేసే అభ్యర్థులకు విదేశాలలో అధిక జీతం వచ్చే ఉద్యోగాలు సహా విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఒఒ.అఫ్ఆశీఖుశ్రీంఎఅశ్రీశ్రీఖుఝఎవఎ.ఱఅ లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం, హైదరాబాద్‌లోని నేషనల్ స్కిల్ అకాడమీ డైరెక్టర్ 9505800050 ని సంప్రదించండి అని వెంకట రెడ్డి అన్నారు.

# బాసర ఆలయంలో విజిలెన్స్ విచారణ

**భక్తులుగా వచ్చి.. అక్రమాలను గుర్తించారు**




మంచిర్యాల జనవరి 14 (జర్నలిస్ట్ ఫైల్) : బాసర సరస్వతీ ఆలయంలో విజిలెన్స్ విచారణ జరిగింది. ఇందులో వివిధ విభాగాల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించారు. బాసర ఆలయంలో అవినీతి అక్రమాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు కరీంనగర్ కు చెందిన విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. వీరు రెండ్రోజుల క్రితం సాధారణ భక్తులుగా వచ్చి ఆలయంలో టికెట్ ధరలు, టెండర్ల నిర్వహణ తీరు, అధికారుల పనితీరు పరిశీలించారు. ఓ కౌంటర్ లో టికెట్ కొనుగోలు చేసి లడ్డూ, పులిహోర తీసుకున్నారు. అక్షరాభ్యాసం టికెట్ కొనుగోలు చేశారు. కౌంటర్ లోపల పాత టికెట్లు ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్నారు. టెండర్ల నిర్వహణ.. ఈ సంవత్సరం ఎన్నింటికి నిర్వహించారు.. వీటి ద్వారా వచ్చిన ఆదాయ వివరాలను అక్కడున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

**పలు విభాగాలపై అనుమానం..**

తొలుత అన్ని విభాగాలను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. అనుమానం వచ్చిన లడ్డూ, వివిధ సేవల టికెట్ కౌంటర్, అన్నదానం విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల్లో ఒకటి, వారి ముందు మరొకటి ఉండటంతో తేడాలను గుర్తించారు. ఆలయానికి వచ్చే వీఐపీలను సన్మానించే కండువాల కొనుగోళ్లలో అవినీతి జరిగినట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఇంతకుముందు ఎవరు వచ్చినా వారికి ఆలయం తరపున సన్మానం మిగిలిన సేవలు అందించేవారు. వాటితో ఆలయ ఆదాయానికి భారీగా గండిపడినట్లు తెలిసింది. దీనిపై విజిలెన్స్ అధికారులు ఉన్నతాధికారులకు రెండ్రోజుల్లో నివేదిక అందజేయనున్నారు. ఏ విభాగం ప్రభావం పడుతుందోనని ఆలయాధికారులు భయాందోళనకు గురవుతున్నారు.

# భారతీయ జనతా పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నాము




యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జనవరి 14 (జర్నలిస్ట్ ఫైల్) : పట్టణంలోని బిజెపి కార్యాలయం లో మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ భారతీయ జనతా పార్టీ భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టిన ఘనత నరేంద్ర మోడీ వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి ఓటు వేసి గెలిపించాలని పట్టణ ప్రజలను కోరుతున్నాం పట్టణంలో కూడా ఎన్నో ప్రభుత్వ కేంద్ర ప్రభుత్వ పథకాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి మీరు ఓటు వేసి మా కార్యకర్తలను ఆశీర్వదిస్తే మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తాం పట్టణంలోని అన్ని వార్డుల్లో బిజెపి పోటీ చేస్తుంది ఏ పార్టీతో పొత్తు పెట్టుకుని ఆలోచన బీజేపీకి లేదు గమనించాలి 12 వార్డుల్లో బీజేపీ పోటీ చేస్తుంది.కేవలం డబ్బు , మద్యం ఆశ చూపించి కొందరు వ్యక్తులు గెలవాలని చూస్తున్నారు అలాంటి వారికి దూరంగా ఉండి నిజాయితీగా పని చేసే వారిని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. కచ్చితంగా యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ బీజేపీ కైవసం చేసుకుంటుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు .ఇట్టి కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్ ,జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆకుల చంద్రమౌళి ,పట్టణ ప్రధాన కార్యదర్శి నరేష్ ,జిల్లా భానుచందర్ ,కార్యదర్శి దొమ్మాట ప్రభాకర్ ,పలుగుల సురేష్ ,సీనియర్ నాయకులు లెంకల పల్లి శ్రీనివాస్,బందరపు మల్లేష్ ,బోడ సురేష్ ,శివరాత్రి శ్రీశైలం ,ఆకుల దేవేందర్ ,వంశీ ,అనిల్ ,శివ, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత అవగాహన సదస్సు

**ప్రమాదాలను నివారించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి**

**ముత్తారం ఎస్సై రవికుమార్**




ముత్తారం: జనవరి 14(జర్నలిస్ట్ ఫైల్): ముత్తారం మండలంలోని ఓడేడ్,మచ్చుపేట గ్రామంలో ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన సదస్సు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై రవికుమార్ ప్రజలకు హెల్మెట్ వినియోగం,సీట్ బెల్ట్ ధరించడం,మద్యం సేవించి వాహనం నడపడం,అతివేగంగా వాహన నడపడం,ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు.రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రతి ఒక్క పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ,సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని,పోలీస్ శాఖ వారికి సహకరించాలని సూచించారు.రెండు గ్రామాల ప్రజలు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని,నిబంధనలను పాటిస్తామని,పోలీస్ శాఖ వారికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది,అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా తాజ్ పూర్ లో ముగిసిన ముగ్గుల పోటీలు

**ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు**

**విజేతలకు నగదు బహుమతులు అందజేసిన సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్**



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జనవరి 14(జర్నలిస్ట్ ఫైల్): భువనగిరి మండల పరిధిలోని తాజ్ పూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు . ముగ్గుల పోటీలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు . విజేతలుగా నిలిచిన మహిళలకు గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ చేతుల మీదుగా మొదటి బహుమతి 2500 రూపాయలు , ద్వితీయ బహుమతి 1500 రూపాయలు , తృతీయ బహుమతి 1000 రూపాయల నగదు బహుమతులు అందజేశారు . ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు . ఈ సందర్భంగా సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ మాట్లాడుతూ తాజ్ పూర్ గ్రామ ప్రజలకు , మహిళా సోదరీమణులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు . ముగ్గుల పోటీలో విజేతలుగా నిలిచిన మహిళలకు , పోటీలో పాల్గొన్న ప్రతి మహిళా సోదరికి శుభాకాంక్షలు తెలిపారు . గ్రామంలోని ప్రతి కుటుంబం ఆనందంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు . గ్రామ పంచాయితీ పాలక వర్గ సభ్యులకు , గ్రామ సిబ్బందికి , గ్రామ ప్రజలకు భోగి సంక్రాంతి కనుమ శుభాకాంక్షలు తెలిపారు .



# ట్రాఫిక్ నిబంధనల పాటింపుతోనే ప్రాణ రక్షణ

**నాగోల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మక్బూల్ జానీ**

**తట్టి అన్నారంలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా అవగాహన.**




ఇబ్రహీంపట్నం జనవరి 14 (జర్నలిస్ట్ ఫైల్) : ట్రాఫిక్ నిబంధనల పాటింపుతోనే ప్రమాదాలు అదుపులో ఉంటాయని, ప్రాణరక్షణ జరుగుతుందని నాగోల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ అన్నారు. మంగళవారం నాగోల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జానీ ఆధ్వర్యంలో తట్టిఅన్నారం వార్డు కార్యాలయంలో అరైవ్ అలైవ్ సురక్షిత ప్రయాణం క్షేమంగా చేరుకోండి అనే అంశంపై రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మక్బూల్ జానీ మాట్లాడుతూ.ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో మద్యం సేవించడం, అతివేగం, నిర్లక్ష్యం వంటి అలవాట్లు ప్రమాదాలకు కారణమవుతాయని హెచ్చరించారు. ప్రజలు రోడ్డు భద్రతపై మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం డిపో మేనేజర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, అతివేగం ప్రమాదకరమని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం బాధ్యతగా గుర్తించాలని కోరారు. అనంతరం తట్టి అన్నారం మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ... నడుస్తున్నప్పుడు లేదా వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ల వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, అతివేగం ప్రాణాంతకమని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తు చేశారు. జీబ్రా క్రాసింగ్‌లు, సిగ్నల్స్ పాటించాలి, రోడ్డు దాటే ముందు ఎడమ--కుడి వైపులా చూసి జాగ్రత్తగా వెళ్లాలని తెలిపారు. రద్దీ ప్రాంతాలు, ప్రమాదాలు ఎక్కువగా జరిగే రోడ్లను గుర్తించి మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు భయపడకుండా, బాధితులను తక్షణమే సమీప ఆసుపత్రికి తరలించి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. సమయానికి అందే సహాయం అనేక ప్రాణాలను కాపాడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి.ఉస్మాన్, మల్లేష్, పరశు రామ్, గోవర్ధన్, భిక్షపతి, సందీప్, అజీమ్, ఖాతిజ బేగం, తదితరులు పాల్గొన్నారు.

## సరస్‌మేళాలో వైభవంగా సంక్రాంతి సంబరాలు



- సంబరాల్లో కోలాటం ఆడిన డిఆర్డీఎ పిడి విజయలక్ష్మి
- వ్యాపార సామర్థ్యాల పెంపుదలపై శిక్షణ

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :నల్లపాడు రోడ్డులోని రెడ్డి కళాశాల సమీపంలో జరుగుతున్న సరస్ మేళా అఖిలభారత డ్వాక్రా బజార్ లో బుధవారం ఉదయం భోగి పండుగ సందర్భంగా సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. మేళా ప్రాంగణం కళా వేదిక సమీపంలో భోగి మంటలు, సంక్రాంతి చెరుకు గుడలు, గోబ్బెమ్మలు, పండుగ విశిష్టతను తెలియచేసేలా బొమ్మల కొలువు తో రంగులతో అందంగా ఆకర్షణీయంగా ముగ్గులు వేశారు. ఆదర్శ నగర్ షణ్ముఖ కోలాటం బృందం హరిదాసుల వేషధారణ,మహిళల సాంప్రదాయ దుస్తులతో పలు భక్తి గీతాలకు కోలాటం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి కొద్దిసేపు కోలాటం ఆడి కోలాట బృంద సభ్యులను ఉత్సాహ పరిచారు. సంక్రాంతి సంబరాలను సందర్శికులు అధిక సంఖ్యలో వీక్షించారు. సంక్రాంతి శోభ ప్రతిబింబించేలా రూపొందించిన ముగ్గుల వద్ద సందర్శకులు ఫోటోలు దిగటానికి ఉత్సాహం చూపించారు.

**వ్యాపార సామర్థ్యాల పెంపుదల పై శిక్షణ**

సరస్ మేళా శిక్షణ కేంద్రంలో బుధవారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు వ్యాపార సామర్థ్యాలు పెంపుదలపై లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం మహిపాల్ రెడ్డి శిక్షణ ఇచ్చారు. ఎస్ హెచ్ జీ మహిళలకు సేవా, తయారీ రంగంలో ఏర్పాటు చేసుకునే వ్యాపారాలకు పీఎంఈజీపి, పీఎంఎఫ్ఎంఈ, లఖ్ పత్ దీదీ, ముద్రా యోజన , ఏఐఎఫ్, ఎఎంఐ పథకాలు ద్వారా ప్రభుత్వ రాయితీతో అందించే రుణాల గురించి, దరఖాస్తు చేసుకునే విధానం ను వివరించారు. అదేవిధంగా సర్ప్ నుంచి వచ్చిన ప్రతినిధులు స్వయం సహాయక సంఘాల పుస్తక నిర్వహణ గురించి తెలియజేశారు. పరిశ్రమల శాఖ ఐపీఓ తయారీ రంగ వ్యాపారాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి తీసుకోవాల్సిన అనుమతుల గురించి అవగాహన కల్పించారు.

## మనమిత్ర ద్వారా ఫోన్‌లోనే పోలీసు సేవలు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)**:ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, వేగంగా, పారదర్శకంగా అందుబాటులోకి తీసుకువచ్చే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన వినూత్న కార్యక్రమమే మన మిత్ర -- వాట్సాప్ గవర్నెన్స్ అని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ సేవల ద్వారా ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే తమ మొబైల్ ఫోన్‌లోనే పోలీసు శాఖకు సంబంధించిన పలు సేవలను పొందవచ్చని ఆయన వివరించారు. ఫిర్యాదు నమోదు ప్రతిలిపి, ఫిర్యాదు ప్రస్తుత స్థితి, జరిమానా వివరాలు వంటి సమాచారం ఫోన్ ద్వారానే అందుబాటులో ఉంటుందని తెలిపారు. మన మిత్ర సేవలను పొందాలంటే ముందుగా 95523 00009 నంబర్‌ను మొబైల్‌లో భద్రపరచుకుని, వాట్సాప్‌లో "హాయ్ అని సందేశం పంపాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలకు సంబంధించిన ఎంపికలు ప్రదర్శించబడతాయని, అందులో అవసరమైన సేవను ఎంచుకోవచ్చని తెలిపారు. ఆ ఎంపికల్లో పోలీసు శాఖ సేవలను ఎంచుకుంటే ఫిర్యాదు నమోదు, ఫిర్యాదు స్థితి, జరిమానా వివరాలు వంటి సేవలు సులభంగా పొందవచ్చని చెప్పారు. గుంటూరు జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మన మిత్ర –వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పోలీసు సేవలను ఫోన్ ద్వారానే పొందాలని జిల్లా ఎస్పీ కోరారు.

## మాజీ మేయర్ చుక్కా ఏసురత్నం మరణం తీరని లోటు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- చుక్కా ఏసురత్నం భౌతికకాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** :గుంటూరు నగర మాజీ మేయర్, ప్రఖ్యాత జువాలాజి లెక్చరర్ చుక్కా ఏసురత్నం మరణం పట్ల గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చుక్కా ఏసురత్నం గారి పార్థివదేహానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి, ఈ దుఃఖ సమయంలో తాము అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. మాజీ మేయర్‌గా, విద్యావేత్తగా చుక్కా ఏసురత్నం గుంటూరు నగర అభివృద్ధికి, విద్యారంగానికి విశేష సేవలు అందించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని, ఆయన మరణం నగరానికి తీరని లోటు అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. చుక్కా ఏసురత్నం ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## సంప్రదాయాలను భావితరాలకు అందించాలి : ఎమ్మెల్యే నసీర్

- ప్రతి ఇంటా శుభాలు కలగాలి
- గుంటూరు తూర్పు సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్
- ఆకట్టుకున్న గంగిరెద్దులు, కోలాటం ప్రదర్శనలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** :భారతీయ సంస్కృతి, సంప్రదాయ వారసత్వాన్ని రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత మనదేనని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో "మన గుంటూరు- మన సంక్రాంతి" కార్యక్రమంలో భాగంగా స్థానిక కాకుమారి వారి తోట నారా చంద్రబాబు నాయుడు కళా ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన భోగి వేడుకలకు ఎమ్మెల్యే నసీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ భోగి భోగభాగ్యాలతోపాటు అందరి జీవితాల్లో కొత్త వెలుగులు రావాలని ఆకాంక్షించారు. భోగిమంటల్లో దుఃఖాలన్నీ దహించుకుపోవాలని, సకల శుభాలు కలగాలని అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం ప్రజల ముంగిటకు సంక్రాంతి సంబరాలు సంతోషాలు తీసుకొచ్చాయని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మంచి కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. ఇదే విధంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలోనూ ఎన్నడూ లేనివిధంగా సంక్రాంతి సంబరాలకు శ్రీకారం చుట్టామని వెల్లడించారు. పిల్లలు, పెద్దలు, యువత అందరూ సంక్రాంతి సంబరాల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. " మన గుంటూరు.. మన సంక్రాంతి" కార్యక్రమానికి సహకారం అందించిన గుంటూరు నగరపాలక సంస్థకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. సంబరాల్లో భాగంగా కోలాటం, గంగిరెద్దులు, హరిదాసు కీర్తనలు, తాడులాగుట పందెం, లెమన్ టీ స్పూన్ ఆటలు, మ్యూజిక్ చైర్, స్కిప్పింగ్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. అనంతరం పిల్లలకు భోగి పళ్ళు పోసి ఎమ్మెల్యే ఆశీర్వదించారు. సాయంత్రం కూచిపూడి, భరతనాట్యం నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

- భోగి మంట వెలిగించి వేడుకలు ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** :గుంటూరు నగరంలోని ఎన్టీఆర్ స్టేడియం, జ్యోతిర్మయి అ-పార్ట్మెంట్ ప్రాంగణంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి గళ్ళా మాధవి గారు పాల్గొని భోగి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర లు భోగి మంటను వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియం మొత్తం సంక్రాంతి సంబరాలతో పండుగ శోభను సంతరించుకుందని, భోగి మంటలు, భోగి పళ్ళు, చిన్నారుల సందడి, పల్లెటూరి సాంప్రదాయ పూలు, పూరిళ్లు, రంగుల హరివిల్లులు, రంగుల ముగ్గులతో ఈ ప్రాంతం అంతా పండుగ వాతావరణంతో నిండిపోయిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ క్యాడర్ అంతా కలిసికట్టుగా వచ్చి ఈ సంక్రాంతి సంబరాలను నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సంక్రాంతి అనేది కేవలం పిండి వంటలు, పండుగ మాత్రమే కాదని, మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల ప్రతిబింబమని, హరిదాసులు, గంగిరెద్దులు, కోడి పందాలు, భోగి పళ్ళు, రంగుల ముగ్గులు వంటి ప్రతి సంప్రదాయానికి ప్రతీక అని, ఇవన్నీ మన భారతీయ సంస్కృతికి, ముఖ్యంగా ఆంధ్రుల సంస్కృతికి అద్దం పడుతున్నాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఇల్లు సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో తులతూగాలని కోరుకుంటూ, ప్రజలందరికీ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు.

## నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా భోగి సంబరాలు

- పాల్గొన్న మేయర్ రవీంద్ర



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)**: భోగి పండుగ ప్రతి ఇంటిలో భోగ భాగ్యాలు అందించాలని కోరుకుంటున్నామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం ఎమ్మెల్యే గల్లా మాధవి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి జిఎంసి సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి పండుగ సందర్భంగా భోగి మంటలు వేయడం, చిన్నారులకు భోగి పళ్ళు పోయడం, గంగిరెద్దుల విన్యాసాలు, సన్నాయి మేళం, హరిదాసుల కీర్తనలతోపాటు టగ్ ఆఫ్ వార్ లో పాల్గొని ప్రజలను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తరతరాల నుంచి వచ్చిన తెలుగు సంప్రదాయ పద్ధతులను, క్రీడలను నేటి తరం పిల్లలకు అందించేలా జిఎంసి పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలకు ప్రజల నుండి విశేష స్పందన వస్తుందన్నారు. ఆదరణ కోల్పోతున్న ఆటలను తిరిగి పరిచయం చేయడానికి సంక్రాంతి సంబరాలు ప్రధాన వేదికగా మారాయని, ప్రతి ఆటలో సంస్కృతితో పాటు ఆరోగ్య రహస్యం కూడా ఉంటుంన్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయం ఉత్సాహం కలిసిన సంక్రాంతి వేడుకల్లో ప్రజలతో కలిసి ఆనందంగా గడపడం మర్చిపోలేని అనుభూతన్నారు. మన తెలుగు సంప్రదాయాలను కాపాడుకుంటూ, పండుగలను ఐక్యతతో జరుపుకోవడం మనందరి బాధ్యతని, గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడం చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు. తూర్పు నియోజకవర్గంలోని వెల్ఫేర్ సెంటర్ (నారా చంద్రబాబు నాయుడు క్రీడా ప్రాంగణం)లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోగి మంటలు, చిన్నారులకు భోగి పళ్ళు, గోలీలాట, గంగిరేద్దుల విన్యాసాలు, కోలాటం, డప్పుల వాయిద్యాలు, మహిళల నృత్యాలు ప్రజలను విశేషంగా ఆకర్షించాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాలు నూతన ఉతేజాన్ని ఇస్తున్నాయని, సంబరాల్లో ప్రజలు ఎంతో ఉత్సాహంతో పాల్గొంటున్నారన్నారు.

మహిళలు సంబరాల్లో అధిక సంఖ్యలో పాల్గొనడం ద్వారా వారి సంతోషం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి గురువారం జరిగే సంబరాల్లో కూడా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

## వీక్షకులను మంత్రముగ్ధులను చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :గసరస్ మేళా ప్రాంగణం లోని కళా వేదికపై బుధవారం సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు అత్యద్భుతంగా కొనసాగాయి. కేవి సాయిబాబా శర్మ, ఆర్ పీ ఎల్ నరసింహారావు, కృష్ణకూమారి భక్తి సంగీత విభావరి లో భక్తి గీతాలు ఆలపించారు. త్రిపుర రాష్ట్ర కళాకారులు సంగ్రెయిన్ నృత్యం ప్రదర్శించారు. షణ్ముఖ కోలాటం బృందం భక్తి గీతాలకు కోలాటం, అగ్ని ఘటంతో కోలాటం ప్రదర్శించారు. డీఆర్డీఏ ఉద్యోగులు కృష్ణ వేణి సినీ గీతాలకు డాన్స్, జానీ గీతాలు ఆలపించారు. పెద్ద సంఖ్యలో సందర్శకులు వీక్షించారు.

**సరస్ మేళాలో బుధవారం ప్రదర్శనలు**

సరస్ మేళా లోని కళావేదికపై గురువారం సాయంత్రం 6 గంటల నుంచి ఒడిస్సా కళాకారుల థింసా జానపద నృత్యాలు, పల్నాడు జిల్లా కళాకారుల తోలుబొమ్మలాట, కూచిపూడి, జానపద నృత్యాలు, స్కిట్లు ప్రదర్శిస్తారు.

## ఇనిమెళ్ళలో సంక్రాంతి సంబరాలు



- పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్)** : ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు స్వగ్రామమైన వినుకొండ నియోజకవర్గంలోని ఈపురు మండలం ఇనిమెళ్ళ గ్రామంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సంబరాల్లో పాల్గొనేందుకు గ్రామానికి విచ్చేసిన చీఫ్ విప్ జీవీకి గ్రామ పెద్దలు, బంధుమిత్రులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. భోగ భాగ్యాల భోగి పండుగ రోజు గ్రామంలోని భావన్నారాయణ స్వామి దేవాలయం, శివాలయంలో జరిగిన ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. భోగి పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు, భోగభాగ్యాలు నింపాలని కోరుకుంటూ భగవంతున్ని ప్రార్థించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

## విలువలతో కూడిన రాజకీయవేత్త



- ఏసురత్నంకు ఘన నివాళి అర్పించిన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** :గుంటూరు మాజీ మేయర్ చుక్కా ఏసురత్నం విలువలతో కూడిన రాజకీయవేత్త అని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి కీర్తించారు. బుధవారం చుక్కా ఏసురత్నం భౌతికకాయాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, ఏసురత్నం మంచి అధ్యాపకుడు, రాజకీయ నాయకుడే కాక గొప్ప అభ్యుదయ వాది కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పాపతోటి అంబేద్కర్, దూపాటి వంశీ, బోడపాటి కిషోర్, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, పార్టీ నేతలు ఆలా కిరణ్, భాగ్యారావు, రెడ్డి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కోడి కత్తుల తయారీ ముఠా గుట్టు రట్టు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** :కోడి పందేలకు వినియోగించే కోడి కత్తుల తయారీ ముఠాను నల్లపాడు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు గుట్టు రట్టు చేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ అలహరి శ్రీనివాస్ పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా కోడి పందేలు జరగకుండా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పటిష్ట నిఘా కొనసాగిస్తున్నారు.

ఈ క్రమంలో కోడి పందేల నిర్వాహకులు, కోడి కత్తులు తయారు చేసి సరఫరా చేసే వ్యక్తులు, పందేల కోసం బరులు ఏర్పాటు చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించి చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు. నల్లపాడు స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని నాయుడు పేట, అంబేద్కర్ కాలనీ (జిందాల్ ఫ్యాక్టరీ సమీపంలో)లోని ఓ నివాస గృహంలో కోడి కత్తులు తయారు చేస్తూ, వాటికి సాన పెట్టి అక్రమంగా వ్యాపారం నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. ఈ సమాచారంతో నల్లపాడు పోలీస్ స్టేషన్ సిబ్బంది సహకారంతో సదరు ఇంటిపై దాడి నిర్వహించి, బండి బాలచంద్ర (49), తండ్రి బ్రహ్మయ్య, నివాసం శ్రీనివాసరావు పేట, గుంటూరు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. దాడిలో భాగంగా 60 కోడి కత్తులు, మూడు కోడి కత్తులకు సాన పెట్టే మిషన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని తదుపరి విచారణ నిమిత్తం నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తూ జీవ హింసకు పాల్పడే వారిపై ఎలాంటి సడలింపు ఉండదని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## మిర్చి యార్డులో మకర జ్యోతి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** :మిర్చి ఘాటుతో అలరారే గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో బుధవారం పూర్తి ఆధ్యాత్మిక వాతావరణం తాండవించింది. సంక్రాంతి సందర్భంగా వెలిగించిన మకర జ్యోతి కాంతులతో దేదీప్యమానంగా ప్రకాశించింది. శ్రీ వరసిద్ధి వినాయకాయ స్వామి దేవాలయం ఎదురు ఏర్పాటు చేసిన జ్యోతి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఈ కార్యక్రమంలో లేళ్ళ పెద్ద అప్పిరెడ్డి, కుర్రి సాంబిరెడ్డి, కొత్తపల్లి శివ సాంబిరెడ్డి, నారాయణరావు, పుల్లారావు, సంజయ్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

# సరాస్ మేళాలో ఫుడ్‌కోర్టుకు సందర్శకుల తాకిడి

- ఉత్తర, దక్షిణ భారతదేశ వంటకాలను అమితంగా ఇష్టపడుతున్న ఆహార ప్రియులు
- రోజు రోజుకి పెరుగుతున్న సందర్శకులు
- ఎస్ హెచ్ జీ తోనే మంచి వ్యాపార అవకాశం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఫుడ్ స్టాల్స్ నిర్వాహకులు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : సరస్ మేళా లో ఏర్పాటుచేసిన ఫుడ్ కోర్ట్ లో ఉత్తర, దక్షిణ భారత దేశాల వెజ్, నాన్ వెజ్ ఆహార పదార్థాలు ఆహార ప్రియులను పెద్ద ఎత్తున ఆకర్షిస్తున్నాయి. మేళాను సందర్శించిన ప్రతి ఒక్కరు ఫుడ్ కోర్టులో ఆహార పదార్థాలు రుచి చూసి అద్భుతంగా ఉన్నాయని ప్రసంగిస్తున్నారు. దీనితో రోజురోజుకి ఫుడ్ కోర్ట్ కు వచ్చే వారి సంఖ్య భారీగా పెరిగి పోయింది. ఫుడ్ కోర్ట్ లో ఆంధ్ర రాష్ట్రం తో పాటు 12 రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యులు 18 స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. పండుగ సెలవులతో కుటుంబ సమేతంగా పిల్లలతో కలిసి వస్తున్న ప్రజలు, యువత ఫుడ్ కోర్ట్ లో లభించే దేశంలోని విభిన్న ప్రాంతాల ఆహార పదార్థాలను రుచి చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. ఇక్కడ వేడివేడిగా రుచికరంగా దేశంలోని వివిధ రకాల వంటలను లైవ్ లో తయారుచేసి అందించటంతో ప్రజలు మరింతగా ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా వెజ్, నాన్ వెజ్ స్నాక్స్, బిర్యానీలు, , ఫ్రూట్ జ్యూస్ లు, డిసార్ట్ లు ప్రియంగా తింటున్నారు. జమ్మూ కాశ్మీర్ లహబీ కబాబ్. తబక్ మజ్, సీక్ కబాబ్, మటన్ టిక్కీ, చికెన్ టిక్కీ, నాన్ వెజ్ స్నాక్ ఐటమ్స్, బిర్యానీలు, హర్యాన వెజ్-పానీ పూరీ, చోలే భతురే, మహారాష్ట్ర వడపావ్, పావ్ బాజీ , పంజాబ్ ఆలు టిక్కీ, దహీ బల్ల, పట్టా చాట్, దహీపూరి, సవేపూరి, తెలంగాణ. హైదరాబాద్ చికెన్ ధమ్ బిర్యానీ, బగరా రైస్ విత్ చికెన్ కర్రీ, ఉత్తర ప్రదేశ్ ఉరద్ చావల్, రాజ్మా చావల్, కడి చావల్, చోలే చావల్, వెజ్ బిరియాని, పానీపూరీ, చాట్ మసాలా, కేరళ కప్పా బిర్యానీ మరియు ఫిష్ కర్రీ, పాల కప్పు , చికెన్ కర్రీ, మిల్క్ షేక్స్, కేరళ స్పెషల్ ఫ్రూట్ బౌల్, సలాడ్స్ జ్యూస్ లు, జార?ండ్ వెజ్-ఆలూ పరోటా, చావల్ చిల్లా, లెమ్పా, బలుషాహి, చావల్ దాల్ సజ్జీ, ఉత్తరాఖండ్ జంగూర్ కీ కీర్, ఫ్రూట్ ఐస్ క్రీం, తందూరి చాయ్, బర్గర్, పిజా రకాలు, రాజస్థాన్ రాజస్థానీ థలి, దాల్ బాటి చుర్మ, రాజ్ కచోరి, మార్వాడి కుల్ఫీ మిర్చి వడ చికెన్ రోల్స్, ఒడిశా రుమాలి వెజ్ పరోటా, రుమాలీ చికెన్ పరోటా, ఆంధ్రప్రదేశ్ అరకు కాఫీ, కాకినాడ కాజ, పూతరేకులు, నేతి స్వీట్లు ప్రజలు ఎక్కువగా తింటున్నారు. కేవలం ఫుడ్ కోర్ట్ లోని ఆహారపదార్థాల కోసమే మేళాను ప్రతిరోజూ సందర్శిస్తున్న వారు ఉన్నారు. ఫుడ్ కోర్ట్ లో ప్రశాంతంగా కూర్చుని తినటానికి 300 సామర్థ్యంతో టేబుల్స్, కూర్చిలు ఏర్పాటు చేశారు. ఫుడ్ కోర్ట్ లో ఉదయం నుంచే ప్రజల ఎక్కువ మంది వస్తుండగా, సాయంత్రం వేళల్లో, శెలవు దినాల్లో మరింత ఎక్కువగా వస్తున్నారు."ఒకే చోట అన్ని రకాల రుచులు అద్భుతంగా ఉన్నాయి" అంటూ ప్రతి ఒక్కరు ప్రశంసిస్తున్నారు.

స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సహం కారణంగానే మరింతగా వ్యాపారాన్ని విస్తరించి ఆర్థిక అభివృద్ధి సాధించటం తో పాటు ఇతరులకు ఉపాధి కల్పిస్తున్నామని ఫుడ్ కోర్ట్ లో స్టాల్స్ నిర్వహిస్తున్న ఎస్ హెచ్ జీ సంఘాల మహిళలు తెలిపారు. ఫుడ్ కోర్ట్ లో మహిళల తో పాటు కేరళకు చెందిన ట్రాన్స్ జెండర్ ఎస్ హెచ్ జీ లో చేరి ప్రభుత్వ ప్రోత్సాహం తో ఫ్రూట్ స్టాల్ నిర్వహింస్తున్నారు. స్టాల్స్ నిర్వహిస్తున్న ఎస్ హెచ్ జీ సభ్యుల విజయ గాధలు వారి మాటల్లోనే...

స్వయం సహాయక సంఘంలో చేరి ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతో ఎర్నాకులం కలెక్టర్ సహకారంతో జిల్లా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఫ్రూట్ జ్యూస్ స్టాల్ ను ఏర్పాటు చేశాను. అఖిల భారత స్థాయిలో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరిగే ఫుడ్ కోర్ట్ లో స్టాల్ ఏర్పాటుకు అవకాశం కల్పించడంతో మరింత విస్తృత స్థాయిలో మార్కెటింగ్ కి అవకాశం కలుగుతుంది.

గతంలో రోజుకు రూ. 500 మాత్రమే సంపాదన ఉండేది, ఎస్ హెచ్ జీ లో చేరి ఫ్రూట్ జ్యూస్ స్టాల్ ఏర్పాటు వలన నెలకి రూ. 1.50 లక్షల వరకు సంపాదించడంతోపాటు నాలాంటి ఉపాధి కల్పిస్తున్నాను. ఇక్కడ ప్రజల ఆదరణ బాగుంది, ఫ్రూట్ బౌల్, ఐస్ క్రీమ్స్, మసాలా జ్యూసులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు రోజురోజుకి వ్యాపారం పెరుగుతుంది. స్వయం సహాయక సంఘంలో చేరి అక్కడ అందించిన ఆర్థిక సహాయంతో ఫుడ్ స్టాల్ ఏర్పాటు చేసుకున్నాం. దీని మీద వచ్చిన ఆదాయంతో పదిమందికి ఉపాధి కల్పించడంతోపాటు నేను బీసీఏ చదవడానికి అవసరమైన ఫీజులను ఎవరిపై ఆధారపడకుండా చెల్లించుకుంటున్నాను. ఎస్ హెచ్ జీ లో చేరడం దేశవ్యాప్తంగా జరిగే డ్వాక్రా బజార్లలో స్టాల్ ఏర్పాటు చేసుకొనే అవకాశం కలుగుతుంది.

స్వయం సహాయక సంఘం లో చేరటం ద్వారా డిఆర్డిఏ అందించిన రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయంతో అరకు కాఫీ ఆర్థరైజ్డ్ కాఫీ షాపును హైకోర్టు సమీపంలో ఏర్పాటు చేశాము. అఖిల భారత స్థాయిలో జరుగుతున్న సరస్ మేళా లో అరకు కాఫీ రుచులను ప్రజలకు అందించాలని ఇక్కడ స్టాల్ ఏర్పాటు చేశాము. అరకు కాఫీని ప్రతి ఒక్కరు ఆస్వాదిస్తున్నారు. ప్రతిరోజు 18 వేల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి.

శ్రీనగర్లోని ఏడు స్వయం సహాయక సంఘాలకు అందించిన ఆర్థిక సహకారంతో మిషనరీ ని సమకూర్చుకొని వ్యాపారని విస్తరించి డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఆవరణలో ఫుడ్ స్టాల్ ని ఏర్పాటు చేశాం. అఖిల భారత స్థాయిలో జరిగే అన్ని సరస్ మేళా ల్లోను జమ్మూ. కాశ్మీర్ రుచులను పరిచయం చేయడానికి ఫుడ్ కోర్ట్ లో స్టాల్స్ ని ఏర్పాటు చేస్తున్నాం. . స్వయం సహాయక సంఘంలో చేరినందున న్యూఢిల్లీ లో జరిగిన జి20 దేశాల సమావేశంలో వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులకు స్నాక్స్ అందించే అరుదైన అవకాశం మాకు వచ్చింది. ఇక్కడ నాన్ వెజ్ వంటకాలు, డిసార్ట్ లు, కాశ్మీరి టీని ఎక్కువగా ఇష్టపడుతున్నారు సాధారణ రోజుల్లో రూ 40 వేల వరకు అమ్మకాలు జరుగుతున్నాయని, సెలవు రోజుల్లో రూ . 85 వేల వరకు అమ్మకాలు జరిగుతున్నాయి.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఆపన్నహస్తం : మంత్రి అచ్చెన్నాయుడు



- రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోంది

**కోటబొమ్మాళి (జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)తో రాష్ట్రంలోని ఎందరో పేదల ప్రాణాలు కాపాడుతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళిలో బుధవారం టెక్కలి నియోజకవర్గంకు చెందిన 17 మంది లబ్ధిదారులకు రూ. 14, లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్దిదారులు ముఖ్యమంత్రికి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే మానవతా దృక్పథంతో పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నోబుల్ టీచర్స్ సభ్యత్వంలో గుంటూరు జిల్లా తొలి స్థానం సాధించాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదులో గుంటూరు జిల్లా రాష్ట్రస్థాయిలో తొలి స్థానంలో నిలవాలంటూ గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి అనుబంధ సంఘమైన నోబుల్ టీచర్స్ అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి రాష్ట్రంలో గుంటూరు జిల్లా ముందుండేలా కృషి చేయాలని నాయకులకు సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం చేపట్టే ప్రతి కార్యక్రమానికి తన వంతు సహకారం అందిస్తానని మాణిక్యాలరావు హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా సమిష్టిగా ముందుకు సాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. హైమారావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పి. సాయి విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి ఎన్. భాస్కరరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పి. లలిత బాబు, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కూరపాటి రాజా తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి కానుకగా డీఏ బకాయిలు విడుదలపై సీఎంకు, ఏపీ జేఏసీకి కృతజ్ఞతలు


**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సిపిఎస్ ఉద్యోగులకు గత ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు ఒక్కసారిగా ఖాతాల్లో జమ కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల్లో ఆనందం వెల్లివిరిసింది. 2018 జూలై, 2019 జనవరి కాలానికి సంబంధించిన 60 నెలల డీఏ బకాయిలను ఒకేసారి జమ చేయడంలో కీలక పాత్ర పోషించిన ఏపీ జేఏసీ చైర్మన్, ఏపీఎన్జీజీవోస్ అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణకు సిపిఎస్ ఉద్యోగులు, ఏపీసీపీఎస్ఈఏ అధ్యక్షుడు కె. సతీష్, ప్రధాన కార్యదర్శి సి. ఎం. దాస్ కృతజ్ఞతలు తెలిపారు. వస్తాయో రావో అనే అనిశ్చితి మధ్య ఉన్న డీఏ బకాయిలు సంక్రాంతి పండుగ సందర్భంగా ఖాతాల్లో జమ కావడం ఉద్యోగులకు మరింత ఉత్సాహాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారికి, వారి కుటుంబ సభ్యులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌లకు సిపిఎస్ ఉద్యోగుల తరపున ధన్యవాదాలు తెలుపుతూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మన్నవను కలిసిన జిల్లా తెదేపా అధ్యక్షుడు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన ఏపీ లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి షమాణిక్యరావు , గుంటూరులోని మన్నవ వెూవానకృష్ణనం బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యాలయానికి విచ్చేసి, ఆంధ్రప్రదేశ్ టెసర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ తో పలు అంశాలపై చర్చించారు.. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ పిల్లి మాణిక్యారావు ని శాలువాతో సత్కరించి నూతన బాధ్యతలకు శుభాకాంక్షలు తెలిపారు.

## సంక్రాంతి శుభాకాంక్షలు:ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు లేళ్ళ అప్పిరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి పరవశించి ప్రజలకు ఆహారోత్పత్తులు ప్రసాదించే పర్వదినమే సంక్రాంతి అని పేర్కొన్నారు. ప్రత్యేకించి ఇది అన్నదాతల పండుగని ఆయన వ్యాఖ్యానించారు. మన సంస్కృతీ సాంప్రదాయాలను ప్రతిబింబించే అచ్చ తెలుగు సంబరమని ఆయన వివరించారు. ఈ సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితాలలో ఆనందాల సిరులు తేవాలని ఆయన ఆకాంక్షించారు. పండుగ సంబరాలతో తెలుగు లోగిళ్ళలో వెలుగుల సిరులు వెల్లివిరియాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి అభిలషించారు.

## భగభగమండే భోగిమంటలు చైతన్యానికి ప్రతీకలు : ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** తెలుగు వారి సంప్రదాయ పండుగలలో సంక్రాంతి అతిపెద్ద పండుగని ముఖ్యంగా గ్రామీణ ప్రాంత రైతాంగం సంతోషంగా జరుపుకునే మూడురోజుల ముచ్చటైన వేడుక సంక్రాంతి పండుగకు ఎంతో విశిష్టత ఉందని, భగభగమండె భోగిమంటలు చైతన్యానికి ప్రతీకయని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. భోగి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం తెల్లవారు జామున పట్టణంలోని పలు కూడళ్ళలో, తెలుగు తమ్ముళ్ళు ఏర్పాటుచేసిన, భోగి మంటల వేడుకలలో, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆత్మీయ అతిధిగా, సంప్రదాయ దుస్తులలో పాల్గొని, సంబరాల సంక్రాంతి పండుగలో, ప్రధమ ఘట్టమైన భోగి మంటల వేడుకలను ప్రారంభించారు. పార్టీ శ్రేణులతో, భోగిపండుగ ఆనందాన్ని పంచుకున్నారు. శివాజీచౌక్, గంగానమ్మ పేట రైతుబజార్ సెంటర్, ఐతానగర్, ఎమ్ఎస్. పాలెం బాబాటవర్ సెంటర్, వహబ్ చౌక్ ఇలా పలు కూడళ్ళలో ఏర్పాటు చేసిన భోగిమంటల సందడిలో, పాల్గొన్న, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, భోగి మంటల వేడుకకు కొత్తశోభను తెచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతు, సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించే పండుగలలో సంక్రాంతి పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. మూడు రోజులు పాటు జరిగే సంక్రాంతి వేడుకలలో, ఇది తొలిరోజని, ఊరు, వాడ ,పల్లె పట్టణం తేడా లేకుండా ప్రజలందరూ కలిసి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, అనే బలమైన లక్ష్యంతొముందుకు వెళ్తుతు, అనూహ్యమైన అంశాలను ఆవిష్కృతం చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాబోయే రోజుల్లో స్వర్ణాంధ్రప్రదేశ్‌గా చూడబోతున్నామని పేర్కొన్నారు. ఎంతో సందడిగా నిర్వహించిన కార్యక్రమంలొ హరిదాసులు, గంగిరెద్దులు, పందెం కోళ్ళు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమాల్లో వివిధ స్థాయి తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆలపాటి అభిమానులు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

# ముగ్గులు శాస్త్రీయతకు ప్రతీక

- మఠాధిపతులు వీర శివకుమార్ స్వామి
- సంతూర్ సోప్ ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు



**బ్రహ్మంగారి మఠం(జర్నలిస్ట్ ఫైల్):** సంక్రాంతి సంబరాల్లో భాగంగా బ్రహ్మంగారి మఠంలోని జగన్మాత శ్రీ ఈశ్వరి మహాదేవి ఆలయ ప్రాంగణంలో విప్రో సంతూర్ సోప్ వారి సౌజన్యంతో మహిళలకు రంగవల్లుల పోటీ కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది ఈ పోటీ కార్యక్రమాలకు మండలంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మొత్తం 22 మంది సభ్యులు పాల్గొన్నారు వీరిలో మొదటి బహుమతిగా వీర రుచిత గెలుపొందగా ద్వితీయ బహుమతి దేవిరెడ్డి పద్మావతి తృతీయ బహుమతి వెంకట మేఘన సాధించారు ఈ గెలుపొందిన విజేతలకు సంతూర్ సోపు ఆధ్వర్యంలో ఆకర్షణీయమైన బహుమతులను జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి మఠం మఠాధిపతులు శ్రీ శ్రీ వీర శివకుమార్ స్వాముల వారు తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సొసైటీ చైర్మన్ సాంబశివారెడ్డి చేతుల మీదుగా ప్రధానం చేశారు ఈ సందర్భంగా మఠాధిపతులు వీర శివకుమార్ స్వాముల వారు మాట్లాడుతూ ముగ్గులు శాస్త్రీయతకు నిలయమైనవని ముగ్గులలో ఎంతో శాస్త్రీయత దృక్పథం దాగి ఉందని చుక్కతో మొదలై ఎన్నో నుడికారాలతో ముగ్గలను తీర్చిదిద్ది ఎంతో అలంకారప్రాయంగా వేయడం మన సాంప్రదాయానికి ప్రత్యేకగా ఈ రంగవల్లులను గీయడం జరుగుతుందని కనుక ముగ్గులు కేవలం ఆకర్షణకు వేయడమే కాకుండా అందులో ఎంతో శాస్త్రీయత దాగి ఉందని మరి ఇలాంటి మంచి కార్యక్రమాన్ని ఈ సంక్రాంతి పండుగ వేళను పురస్కరించుకొని శ్రీ ఈశ్వరి దేవి మఠంలో ఏర్పాటు చేసినందుకుగాను సంతూర్ షాపు సమస్త వారికి ప్రత్యేక కృతజ్ఞతలని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో సంతూర్ సోపు నిర్వాహకులు భారత్ కుమార్ తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షులు శీలం నరసింహ గౌడ్ పూజా శివ, వెంకట సుధా సౌండ్ సిస్టం అధినేతలు ఉమాపతి భాస్కర్ రెడ్డి వ్యాఖ్యాత ఈశ్వర్ రెడ్డి సుంకు సురేష్ సంపత్ కుమార్ అధిక సంఖ్యల మహిళలు పాల్గొన్నారు

# కొండపాటూరులో సంక్రాంతి సంబరాలు

- పోలేరమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో పోటీలు
- ఉత్సహంగా పాల్గొన్న మహిళలు



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** సంక్రాతి సంబరాలు వేడుకలలో భాగంగా కాకుమాను మండలం పరిధిలోని కొండపాటూరు పోలేరమ్మ తల్లీ దేవస్థానంవద్ద దేవాదాయ శాఖ వారి ఆధ్వర్యంలో బుధవారం భోగి సందర్భంగా పలు పోటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం కు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పొన్నం వీరయ్య చౌదరి, ఆలయ ఈ ఓ జక్కా శ్రీనివాసరావు లు స్వయంగా పర్యవేక్షంచారు. పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం ఆవరణలో సంక్రాతి సంబరాలు ముగ్గుల పోటీలు లెమన్,స్పూన్ పోటీలు మ్యూజికల్ చైర్ మరియు మోకు లాగుడు పోటీలు జరుగును. మరియు ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించారు. ప్రతి పోటీలోనూ గెలుపొందిన ప్రధమ, ద్వితీయ,తృతీయ విజేతలకు బహుమతులను దేవాదాయ, ధర్మదాయ శాఖ, ఆలయ ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో లో అందజేశారు. పోటీలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రజలంతా ఒక్క చోటకు చేరి తెలుగు సంస్కృతి సంప్రదాయాలను నేటి తరం యువతకు తెలియచేప్పేలా వేడుకలను నిర్వహించడం పట్ల గ్రామ ప్రజలు ఆలయ బృందానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. చిన్న పెద్ద అనే వయసు తో సంబంధం లేకుండా అధిక సంఖ్యలో ప్రజలు వేడుకలలో పాల్గొని నేటి యువత కు స్ఫూర్తి ని నింపారు. ఈ కార్యక్రమం లో దేవాదాయ ధర్మదాయ శాఖ ఆలయ కార్యనిర్వాహణాధికారి జక్కా శ్రీనివాసరావు, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పొన్నం వీరయ్య చౌదరి, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, కొండపటూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తోట ఫణింద్ర గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్‌పీటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ



**ధర్మవరం(జర్నలిస్ట్ ఫైల్) :** మోడల్ స్కూల్స్ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ అసోసియేషన్ (ఎంఎస్‌పీటీఏ) ఆంధ్రప్రదేశ్ క్యాలెండర్--2026ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్ ధర్మవరంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రికి నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విద్యారంగ అభివృద్ధి, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల సమస్యలపై ఎంఎస్‌పీటీఏ చేపడుతున్న కార్యక్రమాలను నాయకులు ఈ సందర్భంగా వివరించారు.

ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీటీఏ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, ఎస్వైఎల్‌టీఏ రాష్ట్రకోశాధికారి బోగా గంగాధర్, ఉపాధ్యాయులు వారాధి మధు, గండికోట షేక్ షా వలి తదితరులు పాల్గొన్నారు.

## వల్లూరు జయప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న షేక్ ఖుద్దూస్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్‌ను బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర జోనల్ ఇంచార్ డాక్టర్ షేక్ అబ్దుల్ ఖుద్దూస్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లి జయప్రకాష్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, మైనార్టీ మోర్చ కార్యకలాపాలు, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఇరువురూ చర్చించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రజా సంక్షేమ విధానాలను మరింత విస్తృతంగా మైనార్టీ వర్గాల వరకు తీసుకెళ్లేందుకు సమన్వయంతో పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



**ప్రత్తిపాడు (జర్నలిస్ట్ ఫైల్ ):** నియోజకవర్గం కేంద్రం అయిన ప్రత్తిపాడు బి వి ఆర్ జడ్పీ హై స్కూల్ కు చెందిన పూర్వ విద్యార్థులు సంక్రాతి పండుగను పురస్కరించుకొని ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా 2004-05 విద్యాసంవత్సరం లో పదవ తరగతి చదివిన విద్యార్థులమని తెలిపారు. తాము 21 ఏండ్ల తరువాత ఒకే సారి కలవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఒకరినొకరు కలుసుకొని ఆనందంగా వేడుకలను నిర్వహించారు.


## సరస్ మేళాను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా సరస్ మేళా ను పరిశీలించారు. ప్రాంగణంలోని స్టాల్స్, కంట్రోల్ రూం, ఎంమ్యూజ్మెంట్ పార్క్, ఫుడ్ కోర్ట్ , భోజన శాల వద్ద ఏర్పాట్లను తనిఖీ చేసి అధికారులకు సూచనలు అందించారు. పండగ రోజుల్లో ప్రజల రద్దీ కి అనుగుణంగా విధులు కేటాయించిన అధికారులందరూ పటిష్ట ప్రణాళిక తో అవసరమైన అన్ని చర్యలు తీసుకోని బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు.

# సరస్ మేళాకు పెద్దఎత్తున తరలివస్తున్న ప్రజలు

- సంక్రాంతి శోభ ఉట్టిపడేలా ప్రాంగణంలో ముగ్గులు
- జ్ఞాపకాల పదిలం కోసం సెల్ఫీ పాయింట్ వద్ద ఫోటోలు
- ఏర్పాట్లు అద్భుతమని సందర్శకుల ప్రశంసలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాదుల మెరుగుదలకు, వారు తయారుచేసిన ఉత్పత్తులకు విస్తృతస్థాయిలో మార్కెటింగ్ అవకాశాలు కల్పించడానికి నల్లపాడు రోడ్డు రెడ్డి కళాశాల సమీపంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సరస్ మేళా అఖిలభారత డ్వాక్రా బజార్‌కు బుధవారం ఉదయం నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. సాయంత్రం నుంచి ప్రజల సందర్శన మరింతగా పెరిగింది. బుధవారం భోగి పర్వదినం సందర్భంగా మేళాలో సంక్రాంతి శోభ ఉట్టిపడేలా చెరుకు గడలు, బొమ్మల కొలువు, భోగి మంటలు, గాలిపటాలు, గంగిరెద్దులతో రంగులతో అందంగా ఆకర్షణీయంగా ముగ్గులతో తీర్చిదిద్దారు. మినీ భారత్ గా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారుచేసిన హస్తకళలో, వస్త్రాలు, ఆయుర్వేద ఆర్గానిక్ ఉత్పత్తులు, బండారాలు, పిండి వంటలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వివిధ రాష్ట్రాల సంస్కృతి, సాంప్రదాయాల విశిష్టతను తెలియజేసే చెక్క, మెటల్, క్లాత్, వెదురు, గ్రాస్, ఆకులు, జంతు చర్మం తో తయారు చేసిన హస్తకళా వస్తువులు సరసమైన ధరలతో అందుబాటులో ఉండటంతో ప్రజలందరూ కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. సరసు మేళా సందర్శన అనుభూతి జ్ఞాపకాలను పదిలంగా చేసుకోవడానికి ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సరస్ సెల్ఫీ పాయింట్ వద్ద, సరస్ అక్కా మిర్చి మస్కట్ వద్ద ప్రజలు పెద్ద ఎత్తున ఫోటోలు దిగుతున్నారు. ఫుడ్ కోర్ట్ లో వివిధ రాష్ట్రాల ఆహార పదార్థాలను రుచి చూస్తూ, ఎంమ్యూజ్మెంట్ పార్కు లో చిన్నారులను ఆడిపిస్తూ సందర్శకులు సరదాగా గడుపుతున్నారు. మేళా వద్ద సందర్శకులకు, స్టాల్స్ నిర్వహకులకు ఇబ్బంది లేకుండా జిల్లా యంత్రాంగం అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పిస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

సరస్ మేళా లో చాలా అరుదైన హస్తకళలు అందుబాటు ధరల్లో ఉన్నాయని, ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని సందర్శకులు ప్రశంసిస్తున్నారు. సందర్శకుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

మేళాలో స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన ఉత్పత్తులు చాలా బాగున్నాయి. మంగళగిరి చీరలు, డ్రెస్ మెటీరియల్ , ఇతర రాష్ట్రాల వస్త్రాలు బాగున్నాయి. ఫుడ్ కోర్ట్‌లో ఆహార పదార్థాలు చాలా రుచిగా ఉన్నాయి. చిన్నపిల్లలు ఆడుకోవడానికి ఎంమ్యూజ్మెంట్ పార్కులో ఆట వస్తువులు ఉన్నాయి. ఇక్కడ అన్ని ఏర్పాట్లు బాగున్నాయి.

స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేస్తున్న ఉత్పత్తులను ప్రోత్సహించడానికి ఎటువంటి మేళలు స్థానిక మహిళలను భాగస్వామ్యం చేస్తూ జిల్లా మండల స్థాయిలో తరుచు ఏర్పాటు చేయాలి. దేశస్థాయిలో ఎస్ హెచ్ జీ మహిళల వ్యాపార శక్తిని మేళాలో ప్రదర్శించిన ఉత్పత్తులను స్వయంగా చూసి ఎంతోమంది మహిళలు ప్రేరణ పొందుతున్నారు. ప్రభుత్వం మేళాలో చేసిన ఏర్పాట్లు వలనే ఎక్కువమంది ప్రజలు సందర్శిస్తున్నారు.

మేళాలో వివిధ రాష్ట్రాలకు చెందిన కలంకారి వస్త్రాలు, రాష్ట్రానికి చెందిన కొండపల్లి, ఏటికొప్పాకం బొమ్మలు చాలా ఆకర్షణగా ఉన్నాయి. ఇటువంటి మేళాల ద్వారా యువతకు దేశంలోని ఇతర రాష్ట్రాల సంస్కృతి. సాంప్రదాయాల గురించి , ప్రాముఖ్య హస్తకళ వస్తువులు గురించి తెలుసుకునే అవకాశం కలుగుతుంది. మేళా ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుతూ, మంచినీటిని అందుబాటులో ఉంచుతూ, సందర్శకులకు ఇబ్బందులేకుండా ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయి. మేళాలో వివిధ రకాల వస్త్రాలు చాలా బాగున్నాయి. మహిళలకు అవసరమైన అలంకరణ వస్తువులు, జ్యూవెలరీ, ఇతర వస్తువులు అందుబాటు ధరలోనే లభ్యమవుతున్నాయి. అత్యంత అరుదైన ఆరోగ్యానికి సంబంధించి నాణ్యమైన ఆయుర్వేద ఉత్పత్తులు, చిరుధాన్యాలతో చేసిన పిండి వంటలు , కాకినాడ కాజా, పూతరేకులు, హల్వా, ఇతర ఆహార పదార్థాలు మేళాలో ఉన్నాయి. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు చక్కగా ఉన్నాయి.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467